VISIT…

LANZAROTE Caliente.COM



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st Mar. '60
50
NAYE PAISE
8
AS

Photo by P. Krishna Kumar



బహుమతి
పొందిన వ్యాఖ్య

'పదరా అన్నా వేటకు'

పంపినవారు:
S. V. A. R. మూర్తి - శ్రీకాకుళం



చందమామ

సంచాలకుడు : 'చక్రపాణి'

"యౌగంధరాయణ ప్రతిజ్ఞ" కూడా భాసుడి ఉత్తమ నాటకాలలో ఒకటి. ఈ నాటక రచనలో ఒక అపూర్వమైన శిల్పం ఉన్నది—అది నాటకం చదివితేనేగాని మీకు తెలియదు; కథానాయకుడైన వత్సరాజు ఉదయనుడు గాని, కథానాయిక అయిన వాసవదత్తగాని రంగస్థలంమీదికి రానే రారు. కాని మిగతా పాత్రలు అనుక్షణమూ ప్రేక్షకులకు వారిని జ్ఞాపకంచేస్తూ ఉంటాయి. ఇది భాసుడి అసమాన శిల్ప చాతుర్యానికి ఒక నిదర్శనం.

ఈ సంచికతో "అహింసా జ్యోతి" ముగుస్తున్నది. పై సంచిక నుండి "మార్కోపోలో సాహస యాత్రలు," "గలివర్ యాత్రలు" త్రివర్ణ చిత్రాలతో వెలువడతాయి. "గలివర్ యాత్రలు" కార్టూన్ కథగా వెలువడుతున్నది. చిత్రకారుడు "బాపు". "చందమామ"లో కార్టూన్ కథ ప్రచురించటం ఇదే ప్రథమం. ఈ కథ పాఠకులకు ఆసక్తి కలిగిస్తుందని నమ్ముతున్నాము.

సంపుటి 26 : మార్చి 1960 : సంచిక 3



ఏడవ రోజు తెల్లవారుతూనే భీష్ముడు తన సేనను మండలమనే వ్యూహంలో అమర్చాడు. పాండవసేనలు వజ్రమనే వ్యూహంలో అమర్చబడ్డాయి. ఆనాడు జరిగిన ద్వంద్వయుద్ధాలలో ఉభయపక్షాల గల మహాయోధులందరూ పాల్గొన్నారు; శత్రు పక్షాల వ్యూహాలను భేదించేశారు.

యుద్ధం ఆరంభంలోనే అర్జునుడు కౌరవ సైన్యాన్ని తన బాణాలతో కల్లోలపరిచి, ఐంద్రాస్త్రం ప్రయోగించాడు. దాని ఫలితంగా కౌరవసైన్యంలోని ప్రతి యోధుడూ, ప్రతి గుర్రమూ, ప్రతి ఏనుగూ కనీసం ఒకటి రెండు బాణాల దెబ్బలు తినటం జరిగింది. కౌరవయోధులు భీష్ముడి శరణుజొచ్చారు.

అప్పుడు అర్జునుడితో పోరటానికి భీష్ముడు వచ్చాడు. ఆయనకు రక్షగా ఉండమని త్రిగర్తరాజైన సుశర్మను దుర్యోధనుడు ప్రోత్సహించాడు. త్రిగర్త సైన్యమంతా భీష్ముడివెంట వచ్చింది. అప్పుడు జరిగిన మహాయుద్ధంలో విరాటుడు తన రథాన్నీ, గుర్రాలనూ పోగొట్టుకుని, తన కొడుకైన శంఖుడి రథమెక్కి యుద్ధం సాగించాడు. ఇంతలోనే శంఖుడు ద్రోణుడి చేతిలో తీవ్రంగా గాయపడి రథంలో కూలబడేసరికి విరాటుడు పారిపోయాడు.

శిఖండికీ అశ్వత్థామకూ యుద్ధం జరిగింది. శిఖండి అశ్వత్థామను మూడు బాణాలతో నుదుటిమీద కొట్టాడు. అశ్వత్థామ మండిపడి శిఖండి రథ సారథినీ, జెండానూ, గుర్రాలనూ, శిఖండి చేతి వింటినీ విరగగొట్టేశాడు. శిఖండి కత్తి పట్టుకుని యుద్ధం చేస్తూ చాలాసేపు అశ్వత్థామ బాణాలనుంచి తనను తాను కాపాడుకుని అవతల ఇంకొక రథమెక్కాడు.

సాత్యకికీ, అలంబుసుడనే రాక్షసుడికీ యుద్ధం జరిగింది. వాడు మాయాయుద్ధం



సాగించేసరికి సాత్యకి, అర్జునుడినుంచి సంపాదించిన ఐంద్రాస్త్రం ప్రయోగించి వాడి మాయను పటాపంచలు చేశాడు.

ధృష్టద్యుమ్నుడికీ దుర్యోధనుడికీ జరిగిన ద్వంద్వయుద్ధంలో దుర్యోధనుడు తన రథాన్నీ, ఆయుధాలనూ కోల్పోయి పరాభవం చెంది, కత్తి తీసుకుని పోరాడవలిసి వచ్చింది. అంతలో శకుని వచ్చి అతన్ని తన రథంలో ఎక్కించుకున్నాడు.

ఈ పరాభవంతో కుమిలిపోతూన్న దుర్యోధనుడు చూస్తూండగానే భీముడు కృతవర్మతో ఘోరంగా తలపడి, ఆయనను విరథుణ్ణి చేసి, తన బాణాలతో క్రూరంగా నొప్పించాడు. కృతవర్మ తన బావ అయిన వృషకుడి రథమెక్కాడు.

అర్జునుడికీ, ఉలూపికీ పుట్టిన ఇరావంతుడు, అవంతిరాజులైన విందానువిందులతో పోరాడి, వారిలో ఒకణ్ణి విరథుణ్ణి చేశాడు. తరవాత ఇద్దరూ ఒకేరథంలో ఎక్కి యుద్ధం సాగించారు. ఇరావంతుడు వాళ్ళ సారథిని పడగొట్టేసరికి, గుర్రాలు రథాన్ని లాక్కుని వెళ్ళిపోయాయి.

ఆ రోజు మధ్యాన్నం కాకముందు ఈ విధంగా పాండవ యోధులు విజయపరంపరలు సాధించి కౌరవసైన్యాన్ని క్రూరంగా



నిర్మూలించారు. ఇంతలో ఘటోత్కచుడూ, భగదత్తుడూ తలపడ్డారు. ఇద్దరికీ మహా భయంకరమైన యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఘటోత్కచుడు ఓడిపోయి, భయపడి పారిపోయాడు. భగదత్తుడు పాండవ సైన్యాన్ని చెండాడసాగాడు.

శల్యుడికీ ఆయన మేనల్లుళ్ళయిన నకుల సహదేవులకూ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో నకులుడు తన రథాన్ని కోల్పోయి సహదేవుడి రథమెక్కాడు. తరవాత సహదేవుడు శల్యుణ్ణి ఒక్క తీవ్రమైన బాణంతో కొట్టి, మూర్ఛపోగొట్టాడు. శల్యుడి సారథి రథాన్ని మరలించుకుపోయాడు.



ఆ రోజు యుద్ధంలో పెద్ద ఎత్తున పోరాడి విశేషంగా జనక్షయం చేసినవారిలో ఒకడు అర్జునుడు; అతను యుద్ధంలో సుశర్మను ఓడించటమే గాక, అధికసంఖ్యలో త్రిగర్త యోధులనూ, సైన్యాలనూ నాశనం చేశాడు. రెండోవాడు భీష్ముడు; ఆయన ధర్మరాజు మొదలుగాగల పాండవ యోధులను ఓడించటమే గాక పాంచాల సైన్యాలనూ, యోధులనూ అధిక సంఖ్యలో నిర్మూలించాడు.

ఏడోరోజు యుద్ధం ముగిసేసరికి యుద్ధ భూమి నక్కల కూతలతోనూ, గద్దలు మొదలైన వాటితోనూ భయంకరంగా ఉన్నది. యోధులు తమతమ శిబిరాలకు పోయి, తమ శరీరాలలో గుచ్చుకున్న బాణాలు పీకేయించుకుని, స్నానాలుచేసి, సంగీతం విని, యుద్ధంగురించి మాట్లాడకుండా సుఖంగా నిద్రపోయారు.


మర్నాడు యుద్ధారంభంలోనే భీష్ముడు విజృంభించి పాండవ పక్షాన పోరాడే సోమక, సృంజయ, పాంచాల సేనలను కార్చిచ్చులాగా నిర్మూలించసాగాడు. భీష్ముణ్ణి ఆ సమయంలో ఎదుర్కొనటానికి పాండవ యోధులలో భీముడొక్కడే సాహసించాడు. యుద్ధంలో భీముడు భీష్ముడంత భయంకరంగానూ ఉండి ఆయనను పీడించ నారంభించాడు. భీష్ముడికి అండగా దుర్యోధనుడూ, అతని తమ్ములూ ఉన్నప్పటికీ భీముడు లక్ష్యపెట్టక, భీష్ముడి సారథిని చంపేశాడు. భీష్ముడి రథం తొలగిపోయింది.

వెంటనే భీముడు ఒక్క బాణం ఎక్కుపెట్టి దుర్యోధనుడి తమ్ములలో ఒకడైన సునాభుడి తల తెగవేశాడు. అది చూసి మండిపడి దుర్యోధనుడి తమ్ములు మరి ఏడుగురు—ఆదిత్యకేతువు, బహ్వాశి, కుండధారుడు, మహోదరుడు, పండితకుడు, అపరాజితుడు, విశాలాక్షుడు అనేవారు—భీముడిపైకి వచ్చారు. వీరందరూ వేసిన బాణాలలో కొన్ని భీముడికి తగిలి బాధ

పెట్టాయి. భీముడు మండిపడి తన బాణాలతో ఏడుగురినీ వరసగా చంపేశాడు.

తన తమ్ములు ఈ విధంగా భీముడి చేతిలో చావటం చూసి దుర్యోధనుడికి దుఃఖం వచ్చేసింది. అతను భీష్ముడితో, "తాతా, భీముడు నా తమ్ములనూ, నా సైన్యాలనూ హతమార్చేస్తున్నాడు. నీవు పట్టించుకోకుండా చూస్తూ ఊరుకుంటున్నావు! నా దురవస్థ ఎలా ఉన్నదో చూడు!" అన్నాడు. ఈ మాటలు విని భీష్ముడికి కోపం వచ్చింది. ఆయన దుర్యోధనుడితో, "నీకు ఎందరు ఎన్ని హితాలు చెప్పినా అప్పుడు పెడచెవిని పెట్టావు. నన్నూ, ద్రోణుణ్ణీ ఈ యుద్ధంలో దించవద్దంటే విన్నావుకావు. భీముడు నీ తమ్ములను చూస్తే చంపకుండా విడవడు. పాండవులను జయించటం మాటలుకాదు, కావలిస్తే నీ అంతట నీవే వారిని జయించుకో!" అన్నాడు.

ఆనాటి మధ్యాన్నం యుద్ధం చాలా తీవ్రంగా పరిణమించింది. ధర్మరాజు అజ్ఞననుసరించి పాండవపక్ష యోధులందరూ భీష్ముణ్ణి చంపే ఉద్దేశంతో ఆయనపైకి వచ్చారు. అదిచూసి కౌరవపక్ష యోధులందరూ వారిని ఎదుర్కొన్నారు. అతి భయంకరమైన యుద్ధం సాగింది. ద్రోణుడు



సృంజయ సోమక సైన్యాలను నిర్మూలించసాగాడు. పాండవుల పక్షాన భీముడు ఏనుగుల సైన్యాలనూ, నకుల సహదేవులు అశ్వదళాలనూ నాశనంచేయసాగారు.

ఒక పంకనుంచి ఇరావంతుడు తన యోధులనూ, సైన్యాన్నీ పురికొల్పి కౌరవ సేనలను నాశనం చెయ్యసాగాడు. అప్పుడు శకుని తమ్ములైన గజుడు, గవాక్షుడు, వృషభుడు, చర్మవంతుడు, ఆర్జవుడు, శకుడు అనే ఆరుగురు ఇరావంతుడితో కలియబడి యుద్ధం ప్రారంభించారు. ఇరావంతుడు అందరితోనూ యుద్ధంచేస్తూ, అసామాన్యమైన శౌర్య పరాక్రమాలు ప్రదర్శించాడు.





అతను తన శరీరంలో గుచ్చుకున్న బాణా లనే పీకి తన శత్రువులపై ప్రయోగించాడు! అతని బాణాలకు శత్రువులందరూ మూర్ఛ పోయారు. అదిచూసి ఇరావంతుడు ఖడ్గ ధారి అయి వారిని చంపటానికి కాలి నడ కను బయలుదేరాడు. ఇంతలో వారు మూర్ఛ తెలిసి అతన్ని కమ్ముకోవటానికి ప్రయత్నించారు. అయినా కత్తితో అతను వారిని దూరంగా ఉంచటమే గాక, ఒక్కొ క్కరినే నరకటంకూడా సాగించాడు. మిగి లిన వారంతా అతని కత్తికి బలికాగా వృష భుడు మాత్రమే ప్రాణాలతో తప్పించుకుని పారిపోయాడు.

ఇదిచూసి దుర్యోధనుడు అర్ష్యశృంగుడనే రాక్షసుడితో, "ఆ పోరాడేది ఎవరో తెలుసా? మీ బకాసురుణ్ణి చంపిన భీముడి తమ్ముడి కుమారుడు. నీకెన్నో మాయలూ, మాయా స్త్రాలూ తెలుసు. అందుచేత నువు ఈ యువకుణ్ణి ఎలాగైనా చంపెయ్యి," అన్నాడు.

ఆ రాక్షసుడికీ ఇరావంతుడికీ చాలా సేపు యుద్ధం జరిగాక ఇరావంతుడు మూర్ఛ పోయి, ఆ స్థితిలో రాక్షసుడి కత్తికి బలి అయిపోయాడు.

ఇరావంతుడి చావు అర్జునుడికి వెంటనే తెలియలేదు; అతను మరొకచోట కౌరవ సైన్యాలను నిర్మూలిస్తున్నాడు. కాని ఈ సంగతి ఘటోత్కచుడికి తెలిసి, అతను భూమ్యాకాశాలు దద్దరిల్లేలాగ ఒక గొప్ప సింహనాదం చేసి కౌరవసైన్యాలపైకి పరాక్ర మించాడు. అతని వెనక రాక్షస సైన్యం వచ్చింది. ఇలా మృత్యువులాగా వచ్చిపడే ఘటోత్కచుణ్ణీ, రాక్షసయోధులనూ దుర్యో ధనుడు ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అతనికి అండగా వంగరాజున్నాడు.

దుర్యోధనుడు అత్యంత పరాక్రమశాలి అయి పోట్లాడుతూ తన బాణాలతో అనేక మంది రాక్షస యోధులను చంపాడు. అది చూసి ఘటోత్కచుడు మండిపడి ఒక

శక్తిని తీసుకుని దుర్యోధనుణ్ణి చంపటానికి ఉరుకుతూ వచ్చాడు. అప్పుడు వంగరాజు తన పెద్ద యేనుగును దుర్యోధనుడి రథానికి అడ్డంగా నడిపాడు. ఘటోత్కచుడి శక్తికి ఏనుగు చచ్చింది. వంగరాజు ప్రాణాలతో తప్పించుకుని పారిపోయాడు. ఘటోత్కచుడు మళ్లీ సింహగర్జన చేశాడు.

"ఘటోత్కచుడు దుర్యోధనుణ్ణి పట్టి చంపెయ్య చూస్తున్నాడు. వెళ్ళి రక్షించండి!" అని భీష్ముడు ద్రోణుడితో అనేసరికి, ద్రోణుడూ, సోమదత్తుడూ, బాహ్లికుడూ, సైంధవుడూ, కృపుడూ, భూరిశ్రవుడూ, శల్యుడూ, బృహద్బలుడూ, అశ్వత్థామా, వికర్ణుడూ, చిత్రసేనుడూ, వివింశతి మొదలైన మహాయోధులంతా ఘటోత్కచుడిపైకి వెళ్లారు. రాక్షసులతో వారికి మహాదారుణమైన యుద్ధం జరిగింది. ఘటోత్కచుడు ఆ యోధు లందరినీ హింసించి విజృంభించాడు.

ఇంతలో ఘటోత్కచుడికి తోడుగా భీముడూ, అతన్నిచూసి అభిమన్యుడు మొదలుగాగల యోధులూ వచ్చారు. కౌరవ వీరులు వారితో తలపడ్డారు. తీవ్రమైన యుద్ధం సాగింది. ఈ యుద్ధంలో ఒక సందర్భంలో కౌరవవీరులు భీముణ్ణి చుట్టుముట్టి



చంప యత్నించారు. అది చూసి ఘటోత్కచుడు మాయ పన్ని భయంకరాకారాలు సృష్టించాడు. వాటిని చూసి అశ్వత్థామవంటి యోధుడుకూడా భయపడ్డాడు. మిగిలిన కౌరవ వీరులు పారిపోయారు.

ఆ స్థితిలో భీష్ముడు భగదత్తుడితో, "ఓ రాజా, ఈ ఘటోత్కచుణ్ణి నీవే ఎదుర్కోవాలి. నీ దగ్గర ఎన్నో గొప్ప అస్త్రాలున్నాయి. నీవు ఎందరో రాక్షసులతో పోరినవాడవు," అన్నాడు. భగదత్తుడు సుప్రతీకమనే తన గొప్ప ఏనుగునెక్కి శత్రువులపైకి వచ్చాడు.

భగదత్తుడు భీముడి రథంపైకి తన సుప్రతీకాన్ని నడిపాడు. దశార్ణదేశపు రాజైన క్షత్ర


దేవుడుకూడా గొప్ప ఏనుగునే ఎక్కి ఉన్నాడు; అతను భగదత్తుడికి అడ్డుతగిలాడు. కాని భగదత్తుడి దెబ్బలకు తట్టుకోలేక క్షత్రదేవుడి ఏనుగు పారిపోయింది. ఆ తరవాత సుప్రతీకం పాండవ బలాలను నిర్మూలించసాగింది.

అప్పుడు ఘటోత్కచుడు భగదత్తుణ్ణి ఎదిరించాడు. ఘటోత్కచుడు తన ఏనుగుపై విసిరిన శూలాన్ని భగదత్తుడు దారిలోనే రెండుముక్కలు చేశాడు. తరవాత భగదత్తుడు ఒక బ్రహ్మాండమైన శక్తిని విసిరేసరికి ఘటోత్కచుడు దాన్ని ఎగిరి అందుకుని తన మోచేత్తో తిప్పి కొట్టాడు. ఇది చూసి భగదత్తుడు నివ్వెరపోయాడు; పాండవ సైన్యాలు హర్షధ్వానాలు చేశాయి. వాటిని విని భగదత్తుడు రోషంతో దుస్సహంగా యుద్ధం సాగించాడు. పాండవపక్ష యోధులందరూ అతని బాణాలను రుచి చూశారు. భీముడి సారథి విశోకుడు మూర్ఛపోగా భీముడు గద తీసుకుని కిందికి దిగాడు. ఇంతలో అర్జునుడుకూడా భగదత్తుడితో యుద్ధం చేయవచ్చాడు. అప్పుడే అతనికీ, కృష్ణుడికీ, భీముడికీ ఇరావంతుడి మరణవార్త తెలిసింది.

అర్జునుడికి కాస్సేపు యుద్ధంపైనా, రాజ్యకాంక్షపైనా విరక్తి కలిగి, "ఉభయపక్షాలా జ్ఞాతులను చంపుకునేది ఇది ఏమి యుద్ధం!" అనుకున్నాడు. కాని ఈ యుద్ధాన్ని అంతమొందించటానికి యుద్ధం చెయ్యటమే తప్ప తనకు వేరు మార్గం లేదని అతను తెలుసుకున్నాడు.

ఇంతలో మరికొందరు ధృతరాష్ట్రుడి కొడుకులు భీముడి కంటపడ్డారు. అతను లేళ్లను చూసిన సింహంలాగా అయిపోయి వారిలో కొందరిని చంపేసరికి మిగిలినవారు పారిపోయారు. ఆరోజు యుద్ధం చీకటిపడి కళ్ళు కనిపించకుండా పోయేదాకా సాగి ఆ తరవాత ముగిసింది.





3

[చిత్రసేనుణ్ణి విచిత్రభవనం నుంచి వచ్చిన మంత్రీ, సేనానాయకుడూ భవనంలోకి తీసుకుపోయారు. ఆ భవనంలో రాజోచితమైన అన్నిసౌకర్యాలూ వున్నవి. మర్నాడు చిత్రసేనుడి తండ్రి తారకేశ్వరమహారాజు వచ్చి, అవసరం అనుకుంటె తన నుంచి ఎలాంటి సహాయమైనా పొందవచ్చునని, అతడితో చెప్పి వెళ్లిపోయాడు. తరవాత—]

మర్నాటి ఉదయం చిత్రసేనుడు, తండ్రిని సాగనంపి, మంత్రులతో కలిసి, తిరిగి తన భవనం చేరేసరికి, అక్కడ గుంపుగా కూడిన చాలామంది పౌరులు కనిపించారు. వాళ్లు గొంతులెత్తి, "మహారాజా, మమ్మల్ని కాపాడాలి. ఈ అడవిలో వున్న ఉగ్రాక్షుడూ, వాడి సేవకులూ లోగడ మా పశువుల్ని మాత్రమే ఎత్తుకుపోయేవారు. ఈ మధ్య మనుషుల్నికూడా ఎత్తుకుపోవటం ప్రారంభించారు," అంటూ ఏడ్వసాగారు.

ఉగ్రాక్షుడి పేరు వింటూనే చిత్రసేనుడు నిలువెల్లా కంపించిపోయాడు. కాని, అంతలోనే అతడికి ఎక్కడలేని పౌరుషం వచ్చింది. ఇప్పుడు తను నిస్సహాయుడు కాదు. రాజ్యం, పరివారం, సైన్యంగల రాజు. తన రాజ్యంలోనే వుంటూ ప్రజలను నానా హింసలపాలు చేసేవాడిని ఎవడినైనాసరే, హతమార్చవలసిన బాధ్యత తనమీద వుంది. అలాంటివాడు ఉగ్రాక్షుడైనా, తను మిన్నకుండేందుకు వీలులేదు.



"మీ పశువుల్నీ, మనుష్యుల్నీ ఎత్తుకుపోతున్నది ఉగ్రాక్షుడే అని మీకెలా తెలుసు?" అని అడిగాడు చిత్రసేనుడు.

ఈ ప్రశ్న వింటూనే అక్కడ గుమిగూడిన పౌరుల్లో సంచలనం బయలుదేరింది. కొంత సేపటికి నలుగురు పౌర నాయకులు ముందుకు వచ్చి, "మహారాజా! ఉగ్రాక్షుడు గాని, అతడి సేవకులు గాని పశువుల్ని ఎత్తుకుపోతూవుండగా చూసినవారు చాలా మంది వున్నారు. కాని, మనుషుల్ని అపహరించటం కళ్ళారా చూసినవారుమాత్రం లేరు. నరమాంస భక్షకులైన రాక్షసులకు తప్ప, ఇతర్లకు మానవమాత్రుల్ని అపహరించవలసిన అవసరం ఎందుకు కలుగుతుంది!" అన్నారు.

పౌరనాయకు లిచ్చిన ఈ జవాబు చిత్రసేనుడికి కొంత ఆశ్చర్యం కలిగించింది. పశువుల్ని ఎత్తుకుపోయే రాక్షసులు ఉగ్రాక్షుడి సేవకులే అయినా, మనుష్యుల్ని మాయంచేసేవాళ్ళుమాత్రం, వారై వుండరనుకున్నాడు.

"సరే, మీరు మీ గూడేలకు వెళ్ళండి. ఒకటి రెండు రోజుల్లో ఆ ఉగ్రాక్షుణ్ణి, అతడి అనుచరుల్నీ అదుపులో పెట్టే పని నేను చూస్తాను," అన్నాడు చిత్రసేనుడు.

చిత్రసేనుడిలా అనగానే మంత్రి అతణ్ణి సమీపించి రహస్యంగా, "మహారాజా, ఉగ్రాక్షుణ్ణి గురించి దూతలద్వారా విన్నాను. వాడు మహా భయంకరుడు," అన్నాడు.

చిత్రసేనుడు అక్కడినుంచి భవనంలోకి వెళ్ళేందుకు మెట్లెక్కుతూ, "వాడు భయంకరుడే కావొచ్చు. అలాఅని ఆ రాక్షసుడు మన ప్రజల ధన ప్రాణాలకు నష్టం కలిగిస్తూంటే చూస్తూ వూరుకుంటామా? సేనానాయకు డెక్కడ?" అని అడిగాడు.

ఆ ప్రశ్న వింటూనే వెనకగా వస్తున్న సేనానాయకుడు, "మహారాజా!" అంటూ ముందుకొచ్చాడు.



"మన సైనికులెక్కడ? వాళ్లు సుశిక్షితులా, ధైర్యసాహసాలు కలవాళ్లేనా?" అన్నాడు చిత్రసేనుడు.

సేనానాయకుడు కొంచెం ఆశ్చర్యం కనబరుస్తూ, "వాళ్ళ శిక్షణా, ధైర్యసాహసాల మాటా, మహారాజా? కావాలంటే వాళ్ళు కొండల్ని పిండికొట్టగలరు!" అన్నాడు.

"ఓ౯ ఆ కొండల్ని పిండికొట్టటం, బలం వున్న ఏ కూలివాడైనా చేయగలడు. నే నడిగేది అదికాదు. అవసరం అయితే, ఉగ్రాక్షుడికి ఎదురు నిలిచి పోరాడే గుండె నిబ్బరం మన సైనికులకున్నదా అని నేను తెలుసుకోదలిచాను," అన్నాడు చిత్రసేనుడు.



సేనానాయకుడు నిలువెల్లా కంపించి పోయాడు. తరవాత తడబడే గొంతుతో, "మహారాజా! ఆ రాక్షసుడు..." అంటూ అతను ఏమో చెప్పబోయేంతలో, అతడి తత్తరపాటు గ్రహించిన చిత్రసేనుడు నవ్వి, "సేనానీ, నువ్వే ఆ రాక్షసుడి పేరు విని యింతగా వణికిపోతూంటే, ఇక సైనికుల మాట చెప్పనవసరంలేదు. ఇంతకూ వాళ్ళు నివసించే గుడారాలెక్కడ?" అని అడిగాడు.

సేనానాయకుడు ముందుండి పడమటి వైపునున్న బురుజుమీదికి దారితీశాడు. చిత్రసేనుడు అక్కడికి చేరగానే, సేనానాయకుడు బాణంవేటు దూరంలో వున్న చిన్న చిన్న కొండలూ, పొదలకేసి చేయి చూపుతూ, "మహారాజా! మన సైనికులు గుడారాలు నిర్మించేందుకు ఆ కొండ ప్రాంతాన్ని చదును చేస్తున్నారు," అన్నాడు.

చిత్రసేనుడి దృష్టికి కొన్నివేలమంది సైనికులు కనిపించారు. వాళ్లల్లో ప్రతి ఒక్కడూ పలుగూ, పారా పుచ్చుకుని ఎగుడు దిగుడుగా వున్న కొండప్రాంతాన్ని తవ్వి, పూడ్చి దాన్ని సమతలంగా చేసేందుకు కష్టించి పనిచేస్తున్నారు. వాళ్ళను చూస్తూనే చిత్రసేనుడు తను అర్ధబలమే గాక, చాలా అంగబలంకూడా వున్న రాజు

నని తెలుసుకుని గర్వపడ్డాడు. అతడు మనసులో తనకు ఇంత మేలు చేసిన సిద్ధుణ్ణి తలుచుకుని కృతజ్ఞతా భావంతో తల వంచాడు. "మహారాజా! ఆ రాక్షసిమూకమీద మన సైన్యాన్ని వుపయోగించే ముందు, మనం ముందు వెనుకలు బాగా ఆలోచించవలసి వుంటుంది," అన్నాడు మంత్రి.

"మన సైన్యాన్ని ఆ రాక్షసగణంమీద యుద్ధానికి పంపాలని నాకు లేదు. నేనే స్వయంగా ఆ ఉగ్రాక్షుడితో మాట్లాడి చూస్తాను," అంటూ చిత్రసేనుడు సేనానాయకుడికేసి తిరిగి, "అతడుండే చోటు నీకు తెలుసా?" అని ప్రశ్నించాడు.

"మన చారులద్వారా ఆ రాక్షసుడుండే కోటప్రాంతం తెలుసుకున్నాను, మహారాజా! కాని, తమరు ఒంటరిగా... వాడితో..." అంటూ నీళ్లు నమిలాడు సేనాని.

"నేను ఒంటరిగా అతడి కోటకు వెళ్ళబోవటంలేదు. అక్కడికి దారిచూపేందుకు నా వెంట కొద్దిమంది సైనికులు వుంటారు. రాదలిస్తే నువ్వూ రావొచ్చును," అన్నాడు చిత్రసేనుడు.

"మహారాజా, ఎంతమాట! మీకోసం నేనే కాక, ప్రతిఒక్క సైనికుడూ ప్రాణాలైనా ఒడ్డటానికి సిద్ధంగా వున్నాం," అన్నాడు సేనానాయకుడు.






ఆ తరవాత కొంతసేపటికి చిత్రసేనుడు కొద్దిమంది సైనికులనూ, సేనానాయకుణ్ణీ వెంటబెట్టుకుని, ఉగ్రాకుడి నివాస స్థానానికి బయలుదేరాడు. ఆ రాక్షసుడుంటున్న చోటు ఎరిగివున్న చారులు కొందరు ముందు దారి చూపుతూ నడిచారు. సరిగా మిట్టమధ్యాహ్నం వేళకు అందరూ అడవిలో చాలాదూరం నడిచి, ఉగ్రాకుడుండే కొండ సమీపించారు.

కొండ దిగువనున్న అడవిలో ఉగ్రాకుడి సేవకులైన కొందరు రాక్షసులు చిత్రసేనుణ్ణీ, అతడివెంట వున్న పరివారాన్నీ చూచి, పట్టరాని ఆనందంతో పొట్టలు చెక్కలయేలా నవ్వుతూ, "ఆహాఁ, ఈ నరమానవులు ఎంత బుద్ధిమంతులు! మనకూ, మన యజమానికి ఆహారం అయేందుకు, పని కట్టుకుని యింతదూరం నడిచి వచ్చారు!" అన్నారు.

"మీ నాయకుడికి, నేను వస్తున్నట్టు చెప్పండి. నా పేరు చిత్రసేనుడు!" అని చిత్రసేనుడు ఆ రాక్షసులకు చెప్పాడు.

ఈ మాటలు వింటూనే రాక్షసులు మరింత బిగ్గరగా నవ్వారు. "నరమాంసం అంతా ఒకేరకం రుచి. నీమాంసం ఎక్కువేమిటి? నీ దుస్తులూ అవీ చూస్తూంటే, చాలా విలువైనవిలా కనబడుతున్నవి. నువ్వు కొంపదీసి రాజువా, ఏం?" అని అడిగారు వాళ్లు.





"అవును, రాజునే, చిత్రసేనమహా రాజును. ఇంకా అధిక ప్రసంగం చేస్తే తాట ఒలుస్తాను. ఇక్కడికి నాలుగైదా మడల దూరంలో, అడవిమధ్య వున్న మహా భవనం సంగతి మీకు తెలుసా?" అన్నాడు చిత్రసేనుడు కోపంగా.

ఆ భవనం పేరు వింటూనే రాకసులు తత్తరబిత్తర పడుతూ, "ప్రభో, మన్నించండి! మా నాయకుడు మిమ్మల్ని గురించి చెప్పాడు. మాకు ముందు ముందు కాబోయే మహానాయకుణ్ణి మీరే పంపుతారట. రండి, దయచెయ్యండి. మా నాయకుడు కోటలోనే వున్నాడు," అంటూ చిత్రసేనుడికీ, అతడి




పరివారానికీ అడుగులకు మడుగులొత్తుతూ ఉగ్రాకుడి కోటకేసి దారితీశారు.

ఉగ్రాకుడు నివసించే కోట చాలా విచిత్ర మైనది. అతడు అడవిమధ్య వున్న ఒక చిన్న కొండను తొలిపించి, అందులోనే గదులూ, ద్వారాలూ, బురుజులూ—అన్నీ ఏర్పాటు చేయించుకున్నాడు. కోట చుట్టూ వున్న ఎత్తయిన గోడా, దానిమీద నాలుగు దిక్కులా వున్న పెద్ద బురుజులూ, దాని ముఖద్వారం—అంతా ఒకే రాతిలో మలచ బడింది. యుద్ధంచేసి రాకసుడి కోటను పట్ట దలిచిన మానవమాత్రుడెవడైనా వుంటే-అది సాధ్యమయే పనికాదు. మరో రాకసుడైనా దాన్ని ఆక్రమించుకోవటం దుస్సాధ్యం.

చిత్రసేనుడు ఈ వింత కోటను ఆశ్చర్యంగా చూస్తూ, ముఖద్వారం దాటి లోపల ప్రవేశించగానే, ఉగ్రాకుడి వికటాట్ట హాసం వినబడింది. అతడు తన గృహం ముందున్న ఒక ఎత్తయిన రాతి ఆసనం మీద కూచునివున్నాడు.

"ఓ చిత్రసేనా, ఏదీ నువ్వు వాగ్దానం చేసిన నీ జ్యేష్ఠపుత్రుడు, ఎక్కడ?" అంటూ ఉగ్రాకుడు అందర్నీ కలయచూశాడు.

"ఉగ్రాకా, నీకేమైనా మతి చాంచల్యం కలిగిందా? నిన్న కాక మొన్ననే గదా నేను





నీకు వాగ్దానం చేసింది! అప్పుడే పద్దెనిమి దేళ్లూ గడిచినై అని ఎలా అనుకున్నావ్?" అన్నాడు చిత్రసేనుడు.


చిత్రసేనుడి మాటలకు ఉగ్రాక్షుడు మరింత బిగ్గరగా నవ్వాడు.

"రాక్షసుడు మతి మతిలో వున్నప్పుడే, మానవజాతికి మహా భయంకరుడు. అలాం టప్పుడు మతి చెడి పిచ్చియెత్తటం జరిగితే, మానవజాతే నశించిపోతుంది," అన్నాడు ఉగ్రాక్షుడు.

"మానవజాతి సంగతేమో నాకు తెలి యదు గాని, ముఖ్యంగా నా రాజ్యంలోని మానవులు మాత్రం నశించిపోతున్నారు," అన్నాడు చిత్రసేనుడు.


"నీ రాజ్యమా?" అంటూ ఉగ్రాక్షుడు ఆశ్చర్యపడి, అంతలోనే చిరునవ్వు నవ్వుతూ, "అవును, ఈ ఉగ్రాక్షుడి అడవిఅంతా నీ రాజ్యమే! నర్మదానదీ తీరాన వున్న ధవళ గిరి రాజ్యంవైపు తప్ప, తతిమ్మా అన్ని దిక్కులా, ఈ ఉగ్రాక్షుడి అడవి ఎటు చూసినా నూరు ఆమడలు!" అన్నాడు.

"ఈ అడవి మధ్య వున్న గ్రామాల్లో, గూడేల్లో వున్న ప్రజలను నీ అనుచరులు సంహరిస్తున్నారు, పశువులను ఎత్తుకు పోతున్నారు. ఇది నువ్వు చేసిన వాగ్దానానికి



విరుద్ధం. నన్ను హాయిగా ఈ ప్రాంతాన్ని పాలిస్తూ వుండనిచ్చేందుకు అంగీకరించావు గదా?" అన్నాడు చిత్రసేనుడు.

చిత్రసేనుడి మాటలు వింటూనే ఉగ్రా క్షుడు వెలవెల పోయాడు. ఏదో మాట్లాడ బోయి, అంతలోనే ఆగి, తన కెదురుగా వున్న పెద్ద బండరాళ్లకేసి చేయి చూపుతూ, "అందరూ ఆ పీఠాలమీద సుఖంగా కూచోండి," అని చిత్రసేనుడికేసి నిస్పృహగా చూస్తూ, "చిత్రసేనా! నువ్వు పొరబడ్డావు. నీ ఈ అడవి రాజ్యంలో జరిగే మానవా పహరణలకు బాధ్యులు నా అనుచరులు కాదు," అన్నాడు.






"నువ్వుగాని, నీ అనుచరులుగాని, మనుషుల జోలికే వెళ్లటం లేదని నువ్వు నన్ను నమ్మించ చూస్తున్నావా, ఉగ్రాక్షా?" అన్నాడు చిత్రసేనుడు కోపంగా.


"నా అనుచరులు అసలు మానవుల్ని తాకటం లేదని నేను చెప్పటం లేదు. ఏదో పండగకీ పబ్బానికీ ఒకణ్ణీ అలా ఎత్తుకు పోయి భక్షించి వుండవచ్చు. కాని, గ్రామాల మీద పడి మనుషుల్ని ఎత్తుకుపోతున్నవాళ్లు మరొకరు. వాళ్లు రాక్షసులకన్నా క్రూరులు, భయంకరులు!" అంటూ ఉగ్రాక్షుడు ఆగి, సాలోచనగా చిత్రసేనుడికేసి చూస్తూ, "జ్వాలాద్వీపం పేరు ఎప్పుడైనా విన్నావా, చిత్రసేనా?" అని అడిగాడు.

"అలాంటి పేరు గల ద్వీపం ఒకటి వున్నదనే సంగతే నాకు తెలియదే!" అన్నాడు చిత్రసేనుడు ఆశ్చర్యంగా.

"అయితే, ఈ రాత్రికి నువ్వూ, నీ అనుచరులూ యిక్కడ వుండేట్టయితే, ఆ ద్వీపాన్నుంచి రాత్రివేళల ఈ అడవి ప్రాంతాలకు వచ్చిపోయే ఆ క్రూరుల్ని నీకు చూపెడతాను. వాళ్లు బలంలో మా రాక్షసులకు తీసికట్టే. కాని, వాళ్లు ఎక్కివచ్చే భీకరమైన వింత మృగాలు.... వాటికి రెక్కలు వుండి, ఆకాశంలో ఎగురుతవి గనక పక్షులందాం....వాటి ధాటికి తట్టుకునే శక్తి మాలో ఎవరికీ లేదు. అప్పటికీ, ఆ జ్వాలాద్వీపంనుంచి వింతపక్షి మీద సవారై వచ్చిన ఒకణ్ణి ప్రాణాలతో పట్టుకున్నాం. కాని వాడు ఏ కారణంవల్లనో మర్నాటికల్లా చచ్చిపోయాడు. వాడి కంకాళాన్ని చూడదలిస్తే, నావెంట రా," అన్నాడు ఉగ్రాక్షుడు.

"కంకాళాన్ని కాదు....నువ్వు చెప్పే మాటే నిజమయితే, ప్రాణాలతో వున్న ఆ దుర్మార్గుల్ని, వాళ్లు ఎక్కివచ్చే భయంకర పక్షుల్ని చూడాలని వుంది," అన్నాడు చిత్రసేనుడు. ఇందుకు సరేనన్నట్టు ఉగ్రాక్షుడు తల వూపాడు. —(ఇంకా వుంది)





పశ్చాత్తాప పడనివాడు

విసుగుచెందని విక్రమార్కుడు తిరిగి చెట్టు వద్దకు వెళ్ళి, శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే శ్మశానంకేసి మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, "రాజా, ఈ పని పైన వేసుకున్నందుకు ఇప్పటికైనా నీవు పశ్చాత్తాపపడుతున్నావా? నీవు కాశ్మీరవర్మలాగా పశ్చాత్తాపపడటం చేతగాని వాడివి కావనుకుంటాను. నీకు శ్రమ తెలియకుండా ఉండగలందులకు కాశ్మీరవర్మ కథ చెబుతాను విను," అంటూ ఈ విధంగా చెప్పాడు:

వెనకటికి కపిశదేశంలోని పురుషపురంలో కాశ్మీరవర్మ అని ఒక యువకుడుండేవాడు. అతను బాగా చదివిన పండితుడు, కాని నిరుపేద. పండితులను ఆదరించే దాతలు లేని కారణంచేత అతను తస్కరులతోనూ, తాగుబోతులతోనూ, జూదగాళ్లతోనూ చేరి, దొంగతనాలు చేసి పొట్టపోసుకోవలిసిన స్థితి

బేతాళ కథలు



ఏర్పడింది. సాధారణంగా చదువుకున్న వారు అలాటి నీచులతో స్నేహం చెయ్యలేరు, వారితో చేరిపోలేరు. కాని కాశ్మీరవర్మకు అలా బతకటం స్వాభావికంగానే కనిపించింది. అతనికి ఆత్మీయు లెవరూ లేరు, కాని పండితుడుగా అతణ్ణి ఎరిగిన వాళ్ళు అతను జీవించే పద్ధతి చూసి అసహ్యపడి ఎప్పుడైనా తమ ఇళ్ళకు పిలిచి భోజనం పెట్టటంకూడా మానేశారు. అందుకూ కాశ్మీరవర్మ విచారించలేదు.

ఒక నడి శీతాకాలపు రాత్రి కొందరు దొంగలు శ్మశానానికి సమీపంలో ఊరి వెలపల ఉన్న ఒక పాకలో చేరి తాగారు, జూదాలాడారు. వాళ్ళు ఇళ్ళకు పోవటానికి కూడా లేకుండా బయట విపరీతంగా మంచుపడుతున్నది. కాశ్మీరవర్మ కూడా అక్కడే ఉన్నాడు.

జూదం ఆడే దొంగలలో ఇద్దరికి తగాదా వచ్చింది. ప్రతిసారీ పందెం ఒకడే గెలవటం చూసి రెండోవాడికి కోపం వచ్చింది. గెలిచినవాడు వికటంగా నవ్వాడు. ఆవేశంలో రెండోవాడు బాకుతీసి గెలిచినవాణ్ణి గుండెల్లో పొడిచేసరికి, వాడు కాస్తా చచ్చాడు.

హత్య జరిగేసరికల్లా దొంగలు మంచును కూడా లక్ష్యపెట్టకుండా ఎవరి ఇళ్ళకు వారు జారుకున్నారు.

చివరకు పాకలో కాశ్మీరవర్మా, శవమూ మిగిలారు.

"ఈ హత్య ఊరికేపోదు. ఇందుకుగాను ఎవరో ఒకరు ఉరిస్తంభం ఎక్కుతారు. ఇక్కడే నిలిచిపోతే నేనే ఉరిస్తంభం ఎక్కవచ్చు. ఇక్కడ ఉండటం క్షేమం కాదు. నాకు అప్పుడే చావాలని లేదు," అనుకుని కాశ్మీరవర్మ గుడిసె తలుపు మూసి నగరంలోకి నడవసాగాడు. అయితే అతనికి వెళ్ళేటందుకు ఏ ఇల్లూలేదు. నగరంలో తెల్లవారినదాకా ఏ ఎరిగిన పాత స్నేహితుడి ఇంటనైనా జొరబడదామను

కున్నాడు. ఎవరో ఒకరు పడుకునేటందుకు కాస్త చోటివ్వకపోతారా అని అతని ఉద్దేశం.

ఆ చలిలోనూ, మంచులోనూ పడి నగరపు వీధులవెంట నడుస్తూ, గస్తీవాళ్లు వచ్చినప్పుడు ఏ వీధిపక్క చావడిలోకో వెళ్లి దాక్కుంటూ కాశ్మీరవర్మ తాను పూర్వం ఎరిగిన ఒక మిత్రుడి ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. కొంచెంసేపయాక లోపలినుంచి, "ఎవరు వారు?" అని ప్రశ్న వినిపించింది.

"నేను కాశ్మీరవర్మను. కాస్త తలుపు తీస్తే తెల్లవారినదాకా పడుకుని నా దారిన పోతాను!" అన్నాడు కాశ్మీరవర్మ. లోపలి నుంచి జవాబు రాలేదు.

మంచులో కాళ్లీడ్చుకుంటూ కాశ్మీరవర్మ నగరం ఇంకొకమూల ఉన్న ఇంకొక ఇంటికి వెళ్లాడు. అక్కడా అతని పేరు విన్నాక లోపలివాళ్లు తలుపు తెరవలేదు.

"మనుషులు ఎంత నీచులు! అంతంత ఇళ్లున్నాయి, కట్టుకుపోతారా? చావటానికి సిద్ధంగా ఉన్నవాడికికూడా ఇంత తిండి పెట్టరు; చలితో బిగదీసుకుపోయేవాడికి కొద్ది ఘడియలసేపు పక్కా, కంబళీ అరువియ్యరు!" అనుకున్నాడు కాశ్మీరవర్మ. అతనికి చలితోబాటు అలసటా, ఆకలీ కూడా పట్టుకున్నాయి.



త్వరలో తాను ఇంత తిండితిని వెచ్చగా పడుకోపోతే తెల్లవారేసరికి తాను బతికి ఉండనని అతనికి తోచింది. ఈ శీతాకాలపు చలికి ఇల్లూవాకిలీలేని అనాథలు ఎందరో చావటం అతను చూస్తూనే ఉన్నాడు. అతనికి అలా దిక్కులేని చావు చావాలని లేదు. మర్యాదగా ఎవరూ తనకు ఆతిథ్యం ఇవ్వరు. దొంగతనంగా ఏ ఇంటనైనా ప్రవేశించి, వంటింట్లో ఏమైనా దొరికితే తిని, ఏదో ఒక మూల కొంచెంసేపు వెచ్చగా పడుకుందామని అతను నిశ్చయించాడు.

అందుకు అనువైన ఇల్లు అతనికి ఎదురుగానే కనబడింది. అందులోకి ప్రవేశించటం

అంత కష్టంగా ఉండేటట్టులేదు. ఇల్లు సంపన్నులదే. వంటపాత్రలలో బోలెడంత భోజనం మిగిలిపోయి ఉండవచ్చు, వెళ్లి పోయేటప్పుడు చేతబట్టుకుపోవటానికి వెండి సామగ్రికూడా దొరకవచ్చు.

ఆ ఇంట్లోకి ఎటునుంచి ప్రవేశింతామా అని అతను వీధిలో తచ్చాడుతుండగా లోపల ఎక్కడో ఒకమూల దీపం వెలుగు తున్నట్టు అతనికి తెలియవచ్చింది.


"ఈ నిశిరాత్రివేళ ఈ చలిలో ఈ ఇంటి వాళ్లు హాయిగా పడుకుని నిద్రపోక ఏమని మేలుకున్నారు?" అని అతను విసుక్కున్నాడు. తరవాత అతని కొక ఆలోచన వచ్చింది. లోపల మనుషులు మేలుకునే ఉన్నారు గనక, దొంగలాగా ప్రవేశించేకన్న ఇంట్లోకి దొరలాగే ప్రవేశింతామనుకుని అతను వీధివాకిలి తలుపుతట్టాడు.

ఇంటియజమాని వచ్చి తలుపు తీశాడు. ఆయన కొంచెం వయసుమళ్లినవాడు, కాని మనిషిలో అధికారి లక్షణాలున్నాయి.

"ఏం, ఇంత పొద్దుపోయి తలుపు తట్టారు?" అన్నాడాయన.

"చలికి చచ్చిపోతున్నాను. ఆకలి దహిం చేస్తున్నది," అన్నాడు కాశ్మీరవర్మ.

"లోపలికి దయచెయ్యండి," అంటూ ఇంటియజమాని అతన్ని భోజనశాలకు



తీసుకువెళ్లాడు. ఇంట్లో ఆయన తప్ప ఇంకె వరూలేరు. అందుచేత ఆయనే స్వయంగా అతనికి భోజనంపెట్టాడు. అక్కడ అలమారులలో బంగారు చెంబులూ, పళ్లాలూ ఎన్నో ఉన్నాయి. అందులో ఏ ఒకటి కాజేసినా కాశ్మీరవర్మ దారిద్ర్యం తీరిపోతుంది.

కాశ్మీరవర్మ భోజనం చేస్తుండగా ఇంటి యజమాని, "బాబూ, నీ బట్టలమీద రక్తం మరక ఉన్నది," అన్నాడు.


"నాది కాదు, నా పనీకాదు. దొంగల మధ్య తగాదావచ్చి ప్రమాదవశాత్తూ హత్య జరిగింది. ఆ శవాన్ని తలుచుకుంటేనే కంపరంగా ఉన్నది," అన్నాడు కాశ్మీరవర్మ.

"నేను చాలా శవాలను చూశాను. అనేక యుద్ధాలలో పోరాడాను. నా పేరు జగవీరవర్మ, వినే ఉంటావు," అన్నాడు ఇంటియజమాని.

తరవాత జగవీరవర్మ కాశ్మీరవర్మ పేరూ, అతని స్థితిగతులూ అడిగాడు.

"నాపేరు కాశ్మీరవర్మ అంటారు. వ్యాకరణ తర్కశాస్త్రాలు చదివాను. దొంగతనాలు చేసి జీవిస్తాను," అన్నాడు కాశ్మీరవర్మ.

"అంత గొప్పచదువు చదువుకున్నవాడివి దొంగవృత్తిలోకి దిగావా?" అని జగవీరవర్మ అడిగాడు.



"తప్పేమున్నది? మీ యోధులు కొల్ల గొట్టరా?" అన్నాడు కాశ్మీరవర్మ.


"యోధులకూ దొంగలకూ సాపత్య మేమిటి? యోధుడు ప్రాణం ఒడ్డి యుద్ధ భూమిలో పోరాడతాడు. ప్రతిష్ఠ కోసం ప్రాణాలర్పిస్తాడు. దొంగ అలా కాదు. వాడు స్వార్థంకొద్దీ దొంగతనం చేస్తాడు," అన్నాడు జగవీరవర్మ.

"దొంగలకు కూడా ప్రాణాపాయం ఉన్నది. పైపెచ్చు వారు యోధుల్లాగా ఆత్మ రక్షణకోసం అవతలి వాళ్లను చంపటానికి యత్నించే అవకాశం లేకుండానే ఉరి స్తంభం ఎక్కాలి," అన్నాడు కాశ్మీరవర్మ.

"కాని సైనికులు ప్రజలను రక్షిస్తారు, దొంగలు ప్రజాకంటకులు," అన్నాడు జగ వీరవర్మ కోపంగా.

"అది కేవలం అపోహ. ఏ పల్లెటూరి రైతునైనా అడగండి, వాడికి సైనికులంటే ఎక్కువ భయమో, దొంగలంటే ఎక్కువ భయమో మీకే తెలుస్తుంది. దొంగ ఉన్న వాడి దగ్గిర ఇంత తిండి దొంగిలిస్తాడు, సైని కులలాగా ధన మాన ప్రాణాలు అపహ రించడు," అన్నాడు కాశ్మీరవర్మ.

"నన్ను చూడు. సైన్యంలో ఉండి నే నెంతో డబ్బూ, కీర్తి గడించాను. అందరూ నన్ను గౌరవిస్తారు. ఇది కావాలని నేను



అన్నట్టయితే ప్రజలు నా కోరిక వెంటనే తీర్చుతారు. నువుచూడు. బికారివి. ఇల్లూ వాకిలీ లేదు, తిండిలేదు. గౌరవంలేదు. వేటగాళ్లు వెంటబడిన నక్కకూ నీకూ తేడా లేదు," అన్నాడు జగవీరవర్మ.

కాశ్మీరవర్మ భోజనం పూర్తిచేసి, "అయ్యా, మీకూ నాకూ ఉన్న తేడా అంతా డబ్బులోనే ఉన్నది. మీ డబ్బు నాకుంటే నేను మహా యోధుణ్ణి అయేవాణ్ణి. నాలాగా డబ్బు లేకపోతే మీరూ దొంగతనాలకు దిగేవారు. దొంగలకు మానవత్వం ఉండదనుకోకండి. మీరు నన్ను లోపలికి పిలిచి అన్నం పెట్టినందుకు మీకు ఎంతో కృతజ్ఞుణ్ణి. నేను దుర్మార్గానికి దిగదలిస్తే మీ గొంతు సులువుగా పిసికేసి ఈ బంగారమంతా పట్టుకుపోగలను. మీకు వయసుమళ్లినవారు, ఒంటరిగా ఉన్నారు. నేను యువకుణ్ణి, బలాఢ్యుణ్ణి. అయినా నేను మిమ్మల్ని ఏమీ చేయుటంలేదు," అన్నాడు.

ఈ మాటలు విని జగవీరవర్మకు మండిపోయింది. ఆయన గొంతెత్తి, "నీచుడా! నీకు మనుషుల మధ్యగల అంతరంకూడా తెలియదు. నీ పాండిత్యం దేనికి, కాల్చనా? నిన్నసలు లోపలికి రానివ్వడమే పొరపాటయింది. ఇక ఈ ఇంట్లో ఒక్క క్షణం కూడా ఉండకు, వెళ్లిపో!" అన్నాడు.



అప్పుడప్పుడే తూర్పు తెల్లవారుతున్న లక్షణాలు కనిపిస్తున్నాయి. కాశ్మీరవర్మ లేచి నిలబడి, "అయ్యా, మీకు కీర్తి వచ్చిందేమో గాని మతి పోయినట్టు కనిపిస్తుంది," అంటూ బయటికి వెళ్లిపోయాడు.

బేతాళుడీ కథ చెప్పి, "రాజా, కాశ్మీరవర్మ వృత్తిచేత దొంగ; పరువుగలవాళ్లెవరూ అతను తలుపు తట్టితే పలకరు; అతని స్నేహితులు దొంగలూ, జూదరులూనూ; అతనికి తలదాచుకునే ఇల్లు లేదు, నా అనే వాడు లేడు. ఆకలి వేస్తే తిండికూడా లేదు. అలాటప్పుడు అతనికి రాజసందేనికి? మంచి అవకాశం దొరికినప్పుడైనా అతను దేనికి పశ్చాత్తాప పడడు? తనకన్న ఎంతో పేరు ప్రఖ్యాతులు గలవాళ్లను దేనికి గౌరవించడు? దీనికి సమాధానం తెలిసికూడా చెప్పకపోయావో నీ తల పగిలిపోతుంది," అన్నాడు.

"చావటం ఇష్టం లేనివాడికి బతకటం కన్న ఉత్తమధర్మం లేదు. బతకటంకోసం తనకు అందుబాటులో ఉండే జీవిత విధానాన్ని కాశ్మీరవర్మ అవలంబించాడు. అందుచేత అతను దాన్ని చూసి సిగ్గుపడడు. మర్యాదగా బతికే అవకాశం ఉండి కూడా అమర్యాదగా బతికేవాడే పశ్చాత్తాపపడతాడు. అతనికి జగవీరవర్మమీద గౌరవం లేనిమాట నిజమే. దానికి కారణం యుద్ధాలు చేసేవాళ్ళంటే కాశ్మీరవర్మకు ఏమీ గౌరవం లేదు. జగవీరవర్మకు దొంగలంటే ఎంత అసహ్యమో, కాశ్మీరవర్మకు సైనికులన్నా, వాళ్లు చేసే యుద్ధాలన్నా అంత అసహ్యం. అందులో వారిద్దరూ ఒకరికొకరు తీసిపోరు. అందుకనే కాశ్మీరవర్మ జగవీరవర్మకు కృతజ్ఞత చూపాడేగాని గౌరవం చూపలేకపోయాడు," అని విక్రమార్కుడు చెప్పాడు.

రాజుకు ఈవిధంగా మౌనభంగం కలగగానే బేతాళుడు శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు. —(కల్పితం)





యౌగంధరాయణ ప్రతిజ్ఞ

వత్సదేశానికి రాజయిన ఉదయనుడికి ఏనుగులను వేటాడటమంటే చాలా ప్రీతి, అందుచేత ఆయన ఆ పనిమీద వింధ్యారణ్యాలకు వెళ్ళాడు. ఆ సమయంలో ఆయన మంత్రి అయిన యౌగంధరాయణుడితో వేగులు ఒక వార్త తెచ్చి చెప్పారు: అవంతి రాజైన ప్రద్యోత మహాసేనుడు నాగవనంలో ఒక అద్భుతాకారంగల మాయ ఏనుగును, నీలం రంగుగలదాన్ని ఏర్పాటుచేశాడట; అందులో కొందరు సైనికులున్నారట; వత్సరాజును పట్టుకునే ఉద్దేశంతో ప్రద్యోతుడీ ఏర్పాటు చేసి, ఆ మాయ ఏనుగు వెంట నిజమైన ఏనుగులనుకూడా ఉంచాడట.

ఈ సంగతి తెలియగానే యౌగంధరాయణుడు రాజును హెచ్చరించటానికి సాలకుడనే వాణ్ణి పంపుతూ, "ప్రస్తుతం వెదుళ్లవనంలో ఉన్న రాజు రేపు నాగవనానికి బయలుదేరి పోతాడు; ఆయన బయలుదేరేముందే నీ వీవార్త చెప్పాలి. ప్రద్యోతుడికి పెద్ద సేనఉండికూడా దానిలో ఐక్యతలేని కారణంచేత, ఆయన మనని యుద్ధంలో జయించలేక ఈ దొంగ ఎత్తు ఎత్తాడు. నీవు చాలాదూరం పోవాలి, కనక వేగంగావెళ్లు," అన్నాడు; రాజుకివ్వమని ఒక ఉత్తరం కూడా ఇచ్చాడు.

ఇంతలో ఉదయన మహారాజు వద్దనుంచి ఆయన సంరక్షకుడైన హంసకుడు వచ్చాడని తెలిసింది. యౌగంధరుడు ఆయననుంచి రాజు ఆ కిందటిరోజే నాగవనానికి వెళ్లి శత్రువులకు పట్టుపడిన విధం తెలుసుకున్నాడు. ఉదయనుడు అరుణోదయానికి పూర్వమే వెదుళ్ళ అడవి నుండి బయలుదేరి, ఛత్రం పట్టేవాణ్ణీ, వేటకారులనూ మాత్రమే వెంటబెట్టుకుని, వన్యమృగాలు మాత్రమే ఉపయోగించే బాట వెంబడి నడుస్తూ నర్మదానదిని దాటి, కొంత



పొద్దెక్కేసరికి మదగంభీర పర్వతం చేరుకున్నాడు. అక్కడ సగం ఎండిన కొలనులో కొన్ని ఏనుగులు చేరి తమమీద బురద చల్లుకుంటూ కనపడ్డాయి.

ఇంతలో ఒక సైనికుడు ఉదయనుడి వద్దకు వచ్చి, "మహారాజా, ఇక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఒక ఏనుగును చూశాను. దాని గోళ్ళూ, దంతాలూతప్ప మిగిలిన శరీరమంతా నీలంరంగుగా ఉన్నది. అది సాలవృక్షాల వెనక కదలటం చూశాను," అన్నాడు. రాజు ఆ దుర్మార్గుడి మాటలు నమ్మి, వాడు చూసినది ఏనుగులకు చక్రవర్తి అయిన నీలకువలయ మనుకుని, వాడికి బంగారు కాసులిచ్చాడు. తరవాత ఆయన తన మనుషులను అక్కడే ఉండమని, నీలి ఏనుగును పట్టటానికి తన వీణను తీసుకుని వెళ్ళాడు. తనవీణా వాద్యంతో సమ్మోహింపజేసి ఏనుగులను పట్టటం ఆయనకు అలవాటు. మంత్రులలో ఒకడైన రుమణ్వంతుడు ఒంటరిగా వెళ్ళవద్దని ఎంతచెప్పినా రాజు వినలేదు.

ఆయన ఒక గుర్రం ఎక్కి ఇరవైమంది మనుషులను మాత్రమే వెంటబెట్టుకుని నాలుగు మైళ్ళు నడిచి మధ్యాన్నానికి మాయ ఏనుగు ఉన్న చోటికి వచ్చాడు. వెంటనే ప్రద్యోతుడి సైనికులు రాజునూ, అతని మనుషులనూ చుట్టుముట్టారు. వారు చాలా అధికసంఖ్యలో ఉన్నప్పటికీ ఉదయనుడు వారితో హోరాహోరి పోరాడి సాయంకాలానికి స్పృహతప్పి పడిపోయి, వారికి చిక్కాడు. గాయపడిఉన్న ఉదయనుణ్ణి ఒక మేనాలో ఉజ్జయినికి తీసుకుపోయారు. ఆయనవెంట వెళ్ళి ఈ సంఘటనలన్నీ కళ్ళారా చూసిన హంసకుడు పారిపోయి వచ్చి యౌగంధరాయణుడికి ఈ వివరాలన్నీ చెప్పాడు.

"రాజు ఉప్పుతింటూ నేనాయనను తగిన రీతిగా కాపాడలేక పోయాను. ఇప్పటికైనా

ఆయనను బంధవిముక్తుణ్ణి చేసి తీసుకు రావటం నా విధి. లేదా, ఆ ప్రయత్నంలో నా ప్రాణాలనైనా బలిచేస్తాను. అరుగో, అంతఃపురస్త్రీలు ఆక్రందనం చేస్తున్నారు. ఆ విధంగా వారు మంత్రుల అసమర్థతను లోకానికి ఎలుగెత్తి చాటుతున్నారు!" అన్నాడు యౌగంధరాయణుడు. తరవాత ఆయన ప్రతిజ్ఞ చేశాడు: రాజును విడిపించి తీసుకురాకపోతే తనపేరు యౌగంధరాయణుడు కాదన్నాడు.

ఈ సమయంలో ఒక వింత జరిగింది. బ్రాహ్మణులు భోజనాలు చేస్తున్న చోటికి ఒక వెర్రివాడు వచ్చి, పెద్దగా నవ్వుతూ, "అయ్యలారా, సుఖంగా భోంచెయ్యండి. ఈ కుటుంబానికి కలిగిన విపత్తు తప్పి, సౌభాగ్యం చేకూరుతుంది!" అంటూ అంతర్థానమయాడు. ఒక బ్రాహ్మణుడు ఆ వెర్రివాడి దుస్తులు తెచ్చి యౌగంధరాయణుడికి చూపి, జరిగిన సంగతి విన్నవించాడు. యౌగంధరాయణుడు ఆశ్చర్యపడి ఆ దుస్తులు తాను ధరించేసరికి ఆయన పోల్చ రాకుండా మారిపోయాడు. తరవాత ఆయన బ్రాహ్మణుడితో విశ్రాంతి గృహంలో ఉండమనీ, హంసకుడితో వెళ్ళి విశ్రాంతి తీసుకోమనీ చెప్పి రాజమాతను చూడబోయాడు.



అక్కడ ప్రద్యోత మహారాజు ఉజ్జయినిలో ఉదయనుడు పట్టుబడిన వార్తకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు. ఒకవంక ఆయన కుమార్తె వాసవదత్తను పెళ్ళాడాలని మగధ, వంగ, కాశీ, సౌరాష్ట్ర, శూరసేన దేశాల రాజకుమారులు తమ దూతలను పంపారు. వాసవదత్తను ఎవరికిచ్చి చేయాలో రాజుగాని, రాణిగాని తేల్చుకోలేని స్థితిలో ఉండగా వత్సరాజైన ఉదయనుడు పట్టుపడ్డాడన్న వార్త వచ్చింది. ప్రద్యోతుడి ఆనందానికి మేరలేదు. ఉదయనుడు గాయపడి, నిర్బంధంలో ఉన్నాడని తెలియగానే ఆయన అతని చికిత్సకు ఏర్పాట్లుచేసి, అతన్ని

సుఖంగా ఉండే కారాగృహానికి మార్పు చేయించి, తన నౌకర్లతో, "అతన్ని గౌరవంగా చూడండి. అతని ఎదట యుద్ధంలో ఓడి పోయాడనిగాని, ఖైదీగా ఉన్నాడనిగాని అన కండి," అన్నాడు.

వత్సరాజు ఏనుగులను పట్టటానికి వాయించే ఘోషవతి అనే వీణ ఇప్పుడు ప్రద్యోతుడి పరమయింది. దానిని ఆయన తన కుమార్తెకు కానుకగా ఇచ్చాడు.


"మన అమ్మాయిని పెళ్ళాడదామని ఇంతమంది రాజులు దూతలను పంపినా ఈ వత్సరాజు పంపనేలేదు, చూశారా?" అన్నది రాణి.

"తాను భరతవంశంవాణ్ణనీ, వేదాలు బాగా చదివినవాణ్ణనీ, సంగీతంలో సాటిలేని వాణ్ణనీ, యువకుణ్ణనీ, అందగాణ్ణనీ, ప్రజలు తనకోసం ప్రాణాలు విడుస్తారనీ అతనికి పల్లమాలిన గర్వం!" అన్నాడు ప్రద్యోతుడు.

"మనకు అల్లుడు కాదగిన వాడికి ఉండ దగిన మంచి లక్షణాలన్నీ అతనిలోనే ఉన్నాయే!" అన్నది రాణి.

"మన మాటను కొంచెంకూడా లక్ష్య పెట్టని మన శత్రువును ఏమని మెచ్చు కుంటున్నావు?" అన్నాడు రాజు.

వత్సరాజును విడిపించటానికి వెర్రివాడి వేషంలో బయలుదేరిన యౌగంధరాయ




ఖుడి వెంట రాజవిదూషకుడైన వసంతకుడు బిచ్చగాడి వేషంలోనూ, వత్సరాజుకు మరొక మంత్రి అయిన రుమణ్వంతుడు బౌద్ధశ్రమణకుడి వేషంలోనూ బయలుదేరి ఉజ్జయినికి వచ్చారు.

వారు నగరం చేరిన నాటినుంచీ రాజు విమోచనం కోసం దీక్షగా ప్రయత్నిస్తున్నారు, కాని ఈ ప్రయత్నాలింకా ఫలించలేదు.

ఒకనాడు వారు కాత్యాయనీ ఆలయంలో చేరి మాట్లాడుకోవటంలో వసంతుకుడు రాజువార్తలు చెబుతూ, ఆయన గాయాలు మానిపోయాయనీ, ఆయన స్నానం చేశాడనీ చెప్పాడు.

"మనం రాజును తప్పించి ఇక్కడి నుంచి వెళ్ళిపోయే పథకాన్ని రేపే అమలు చేయాలి. నలాగిరి అనే ఏనుగును కట్టేసే చోటా, స్నానంచేసేచోటా, మేత మేసేచోటా, పడుకునేచోటా ఓషధులను ఎలాగైతేనేం పడ వేశాం. గజశాలకు సమీపంలో ఉండే ఖాళీ కుటీరాన్ని గాలివాలు చూసుకుని తగలబెట్ట టానికి ఏర్పాట్లు చేశాం. ఏనుగులకు నిప్పు అంటే ఎంత భయమో మీకు తెలుసుగదా. వాటిని మరింత రెచ్చగొట్టటానికి గుడిలోని గంటలూ, శంఖాలూ, జేగంటలూ పెద్దగా మోగించుతాం. ఏనుగులు వెర్రెత్తినమీదట ప్రద్యోతుడు వాటిని శాంతపరచటానికి మన





రాజును ఆశ్రయించక తప్పదు. అప్పుడు రాజు ఖైదునుంచి బయటపడి తన వీణతో నలాగిరిని శాంతపరుస్తాడు. ఆ తరవాత ఆయన దానిపై ఎక్కి వేగంగా ప్రయాణం చేస్తూ కౌశాంబీకి వెళతాడు. ఏనుగు మూలంగా చిక్కినవాడు ఏనుగుమూలంగానే బయటపడతాడు. నువ్వు ఎలాగైనా రాజును కలుసుకుని, రేపే ఈ పథకం ఆచరణలోకి వస్తుందని చెప్పాలి," అన్నాడు యౌగంధరాయణుడు వసంతకుడితో.

వసంతకుడు ఏదో ఆలోచించి, ఒక అవాంతరంకాస్తా బయటపెట్టాడు. "వత్స రాజు ఈ పథకానికి సమ్మతించడేమో!" అన్నాడతను. మిగిలిన ఇద్దరూ ఆశ్చర్యపడటం చూసి అతను జరిగిన సంగతి ఈ విధంగా చెప్పాడు:

"గడిచిన కృష్ణాష్టమినాడు రాజకుమార్తె వాసవదత్త పల్లకీ ఎక్కి యక్షిణీ ఆలయానికి తన పరిచారికతోసహా బయలుదేరింది. ఆమె కన్యగనక మేలిముసుగుకూడా ధరించలేదు. రాజమార్గం నీటితో నిండి ఉండటంచేత పల్లకీ కారాగృహం మీదుగా వెళ్ళవలసి వచ్చింది. సరిగా ఆ సమయానికే మనరాజు కారాగృహ రక్షకుడి అనుమతితో బయట వచ్చి నిలబడ్డాడు. ఆయన నిలుచున్నచోటనే బోయీలు పల్లకీ ఆపి భుజాలు మార్చుకోవటం జరిగింది. ఆ సమయంలో మన రాజు వాసవదత్తను చక్కగా చూసి ఆమెను ప్రేమించసాగాడు. మన పథకం చెప్పినప్పుడాయనకు అది నచ్చలేదు. తనను ప్రద్యోతుడు మోసంతో యిక్కడికి తెచ్చాడుగనక, అందుకు తాను వాసవదత్తను ఎత్తుకుపోయి పగతీర్చుకోవాలట!"

యౌగంధరాయణుడికి వార్త విని ఆగ్రహమూ, ఆశ్చర్యమూ కలిగాయి. "ఒకవంక బేడీలు తగిలించుకుని ఖైదీగా ఉంటూ రాజుకి ప్రేమ ఎలా దాపరించింది?" అన్నాడాయన.

"అయ్యా, మనం ఆయనపట్ల విశ్వాసం గలవారమై చేయగలదీ అంతా చేశాం. ఇక మనదారిన మనం తిరిగి పోదాం," అన్నాడు వసంతుడు.


"వసంతకుడేనా ఈ మాటలనేది? రాజును ఈ స్థితిలో విడిచిపోదామని ఎలా అనగలిగావు, వసంతకా?" అన్నాడు యౌగంధరాయణుడు.

"సరే అయితే, ముసలివాళ్ళమయేదాకా ఇక్కడ ఇలాగే కాలక్షేపం చేద్దాం," అన్నాడు వసంతకుడు.

"చేసినా తప్పులేదు. మన పని సాను కూల మైనదాకా దీక్ష వదలరాదు," అన్నాడు యౌగంధరాయణుడు. "రాజును ఖైదునుంచీ, వాసవదత్తను అంతఃపురం నుంచీ బయటికి రప్పించగలిగిన నాడే మన పని సానుకూలమయేది!" అన్నాడు వసంతకుడు నిరాశతో.

"యౌగంధరాయణా, ఆ ఇద్దరినీ బయటికి తెప్పించి, సుభద్రను అర్జునుడు ఎత్తుకు పోయినట్టుగా, మన రాజు వాసవదత్తను ఎత్తుకుపోయే ఉపాయం ఆలోచించు!" అన్నాడు రుమణ్వంతుడు.

"ఉపాయం చెయ్యలేకపోతే నా పేరు యౌగంధరాయణుడు కాదు," అన్నాడు యౌగంధరాయణుడు.



అయన అన్నంతా చేశాడుకూడా. ఆయన సేవకుడు గాత్రసేవకుడనేవాడు వాసవదత్త ఎక్కే భద్రవతి అనే ఏనుగుకు మావటిగా కుదిరాడు.

ఒకనాడు వాడు కల్లుదుకాణానికి పోయి, తాగి కైపెక్కినట్టుగా నటించాడు. వాణ్ణి వెతుక్కుంటూ ఒక భటుడు వచ్చి, "రాజ కుమార్తె స్నానానికి బయలుదేరుతున్నది, ఏనుగును సిద్ధంచెయ్యి," అని చెప్పాడు.

ఈ సమయంలోనే వత్సరాజు వాసవ దత్తను ఎత్తుకుని పారిపోయాడు. ప్రద్యోతుడి సైనికులు వత్సరాజును పట్టుకోవటానికి వెంబడించగా, యౌగంధరాయణుడు తన వెర్రివాడి వేషం విప్పేసి, కత్తి చేతపట్టి హోరాహోరి యుద్ధంచేస్తూ వారిని నిల వేశాడు. చివరికాయన కత్తిని పోగొట్టుకుని చిక్కిపోయాడు.

తరవాత ఉజ్జయిని మంత్రి అయిన భరతరోహకుడు ఆయనను కలుసుకున్నప్పుడు యౌగంధరాయణుడు, "నేను తండ్రి చావుకు పగ తీర్చుకున్న అశ్వత్థామ లాగా శరీరంనిండా రక్తంతో ఉన్నాను," అని గర్వంగా పలికాడు. "మోసంచేసినది చాలక ప్రగల్భాలుకూడా దేనికి?" అని భరత రోహకుడు దెప్పి పొడిచాడు.

"మీరు వత్సరాజును తెచ్చినది మాయ ఏనుగుతో కాదా?" అని యౌగంధరాయ ణుడు అడిగాడు.

అంతలోనే ప్రద్యోతుడు యౌగంధరాయ ణుడికి బహుమానంగా ఒక బంగారు కల శాన్ని పంపుతూ, "మీవల్ల నాకు నిజంగా అపచారం జరగలేదు. మీ గుణగణాలకు నేను సంతోషించాను," అని కబురు చేశాడు. ఆయన ఔదార్యాన్ని యౌగంధ రాయణుడుకూడా మెచ్చుకున్నాడు.

తరవాత రాజసౌధంలో ఉదయన వాసవదత్తల బొమ్మలుంచి వివాహవిధి అంతా జరిపించారు.





అదిరిపాటు

కళింగరాజు కుమార్తె మైనావతి గొప్ప అందగత్తె. ఆ కారణంచేతనే ఆమెకు అహంకారంకూడా జాస్తిగా ఉండేది. ఆమెకు యుక్తవయసు రాగానే కళింగరాజు ఆమె వివాహంకోసం ప్రయత్నాలు చేశాడు. ఆమెకు ఈడూజోడూ అయిన రాజకుమారుల పటాలను మంత్రులు తెప్పించారు. కాని మైనావతి అందరినీ నిరాకరించింది. మంత్రులకు ప్రాణం విసిగిపోయింది, రాజుకూ ప్రాణం విసిగిపోయింది. ఒక మంచిరోజు చూసి కళింగరాజు తన కుమార్తె స్వయంవరం నిశ్చయించి అన్ని దేశాలకూ ఆహ్వానం పంపాడు. అందరు రాజులూ ఒకచోట కూడితే మైనావతి తన భర్తను తానే ఏరుకుంటుందనీ, ఆ తరవాత తనకు ఆమె భారం తీరిపోతుందనీ రాజు ఆశించాడు. స్వయంవరానికి దేశదేశాల రాజులందరూ వచ్చారు.

జగదేకసుందరి అని ప్రసిద్ధిగన్న మైనావతిని పెళ్లాడాలని అందరికీ ఉబలాటంగానే ఉన్నది. సభాభవనంలో ఆగంతకులు ఆసనాలపైన బారులు తీరి కూర్చున్నారు. రాజకుమార్తె మైనావతి వచ్చి ఒక్కొక్కరినే చూసింది. ఒకడు లావుగా, బస్తాలాగా ఉన్నాడనీ, ఇంకొకడు సన్నగా, వానపాములాగా ఉన్నాడనీ; ఒకడు తెల్లగా, సున్నపుదుత్తలాగా ఉన్నాడనీ, మరొకడు నల్లగా, రాకసిబొగ్గులాగా ఉన్నాడనీ, వేరొకడు ఎర్రగా, కందగడ్డలాగా ఉన్నాడనీ అందరికీ తలా ఒక పేరూపెట్టి నిరాకరించింది. చిట్టచివర కూర్చున్న రాజకుమారుడికి ఏవంకా లేదు; అతను యువకుడు, చాలా అందంగా ఉన్నాడు. అయినా రాజకుమార్తె మైనావతి అదిరిపాటుకొద్దీ, అతని మీసాలకేసి కాస్సేపు చూసి, " ఈ మీసాలపోతు నాకు వద్దు!" అనేసింది.

కె. వెంకటరామయ్య



వచ్చిన రాజులందరూ తమ దారిన తాము వెళ్లిపోయారు. కళింగరాజు, ప్రాణం విసిగిపోయి, తన కుమార్తెతో, " నీ పొగరు అణుస్తాను, చూస్తూ ఉండు. ఈసారి మన ఇంటి ముందుకు వచ్చి నిలబడిన మొదటి బిచ్చగాడికో, గాయకుడికో నిన్ను ఇచ్చి పెళ్లి చేసేస్తాను!" అన్నాడు.

రాజు అన్నట్టుగానే మర్నాడు ఉదయం చీకటితోనే ఒక బిచ్చగాడు రాజుగారి దివాణ ద్వారం వెలపల నిలబడి పాటలు పాడ సాగాడు. వాడికి పెద్ద బవిరిగడ్డం ఉన్నది. పంటిన చింకిపాతలు వేసుకున్నాడు. వాడు పాట నిలపగానే రాజభటులు వచ్చి లోపలికి పిలుచుకుపోయారు. రాజుగారి పురోహితుడు క్షణంలో వాడిచేత రాజకుమార్తెకు తాళి కట్టించి పెళ్లిచేసేశాడు. మైనావతి ఏడిచింది, రాగాలుపెట్టింది. రాజుగారి గుండె ఏమాత్రమూ కరగలేదు. పెళ్లితంతు పూర్తి కాగానే ఆయన బిచ్చగాడితో, " ఇదుగో, ఈ అయిదు రూపాయలూ తీసుకుని నీ పెళ్లాన్ని వెంటపెట్టుకుని తక్షణం ఎక్కడైనా వెళ్లిపో! మీ ఇద్దరి ముఖాలూ నాకు మళ్లీ చూపించ వద్దు," అన్నాడు.

జారిపోయిన గుండెతో మైనావతి తన భర్తవెంట బయలుదేరింది. దేవుడి దయ వల్ల ఆ గడ్డంవాడు ఏ మాత్రమూ మొరటు మనిషి కాడు. అది కొంతలో కొంత నయమని మైనావతి అనుకున్నది. వారు కొంత దూరం వెళ్లాక ఒక అడవి వచ్చింది. " ఈ అడవి అంతా ఎవరి రాజ్యంలోది ?" అని మైనావతి భర్తను అడిగింది.

" మీసాలపోతు అంటారే, ఆ రాజుది!" అన్నాడు గడ్డంవాడు. తరవాత వారు ఎన్నో పొలాలూ, తోటలూ దాటి ఒక చక్కని నగరానికి వచ్చారు. అవన్నీ " మీసాలపోతు " రాజుగారివేనని తెలిసినప్పుడు, మైనావతి అతన్ని తన భర్తగా వరించనందుకు చాలా పశ్చాత్తాపపడింది.

చిట్టచివరకు ఇద్దరూ ఒక పూరిగుడిసె దగ్గిరికి వచ్చారు. "నన్నిక్కడికి తీసుకొచ్చావేమిటి?" అన్నది మైనావతి ఆశ్చర్యంగా తన భర్తతో.

"ఇది నా ఇల్లు, ఇకనుంచీ మన ఇల్లు," అన్నాడు గడ్డంవాడు.

చచ్చినట్టు మైనావతి ఆ గుడిసె అంతా శుభ్రంచేసి, పొయి వెలిగించి, వంట చేసింది. గడ్డంవాడు వెదురు కోసుకొచ్చి, దాన్ని చీల్చి బుట్టలల్లటం నేర్పి ఆమెకు పని కల్పించాడు. ఆ పని మూలంగా ఆమెకు వేళ్లు నొచ్చాయి. "పోనీ అయితే కుట్టుపని చెయ్యి," అన్నాడు. ఆమె బట్టల చిరుగులు కుట్టింది. ఆ సమయంలో వేలికి సూది గుచ్చుకుని బాధపెట్టింది. తన భార్య దుఃఖించటం చూడలేక గడ్డంవాడు, ఆమెకు ఒక కుండల దొంతి ఇచ్చి, "వీటిని తీసుకు పోయి అమ్ముకురా!" అన్నాడు. ఆమె వాటిని తీసుకుపోయి, ఒకచోట పరుచుకుని అమ్మటానికి కూర్చునేసరికి ఒక వేటగాడు గుర్రంమీద అటుగా అమిత వేగంగా వచ్చాడు. వాడి గుర్రం మైనావతి తెచ్చిన కుండలన్నిటినీ పప్పుపప్పుగా తొక్కేసింది. మైనావతి ఏడుస్తూ తన భర్త వద్దకు వెళ్లి జరిగినదంతా చెప్పింది.



"నీకు కుండల అమ్మకంకూడా అచ్చి రాలేదు. రాజుగారి వంటసాలలో నీకు పనేమైనా ఇస్తారేమో కనుక్కుంటాను. అక్కడ పనిచేస్తున్న వంటవాళ్ళలో నేనెరిగినవాళ్లు కొందరున్నారు," అన్నాడు గడ్డంవాడు మైనావతితో.

ఇది అన్నిటికన్న కూడా పెద్ద అవమానంగా ఆమెకు తోచింది. కాని రాజుగారి వంటసాలలో పనిచెయ్యక ఆమెకు తప్పలేదు. ఆమె పగలల్లా అక్కడ పనిచేసి, రాత్రి ఇంటికి వచ్చేటప్పుడు, తన భర్తకు తినుబండారాలూ, వంటకాలూ మూటగట్టి ఒడిలో పెట్టుకుని వచ్చేది.

ఒక వారం ఇలా గడిచాక రాజభవనంలో పెద్ద అడావుడి సాగింది. రాజుగారికి పెళ్ళి అన్నారు. పెళ్లికూతురెవరో ఎవరికీ తెలియ లేదు. మైనావతి ఆ రోజల్లా పనిచేసి రాత్రి ఇంటికి బయలుదేరేటప్పుడు వంటవాడు, "చావడి అంతా దీపాలతోనూ, తోరణాల తోనూ చక్కగా అలంకరించారు, చూసి వద్దాం!" అన్నాడు.

ఇద్దరూ చావడికేసి వెళ్ళారు. వాళ్ళు వాకిట నిలబడి తొంగి చూస్తుండగా ఎక్కడి నుంచో "మీసాలపోతు" వచ్చి, "ఎవరీ మనిషి? తొంగి చూసినందుకు ఒక నృత్యం చేసి మరీ వెళ్ళమను," అన్నాడు వంట వాడితో కోపంగా.

మైనావతి భయపడుతూ చావడిలోకి అడుగు పెట్టింది. రాజుగారు సంజ్ఞ చేయ గానే వాద్యగాళ్ళు పాట వాయించారు. మైనా వతికి నృత్యం చెయ్యటం చాతనవును. అందుచేత ఆమె తనకేమీ ఇష్టం లేక పోయినా విధిలేక నృత్యం ప్రారంభించింది. ఆమె నృత్యం ప్రారంభించగానే ఒడిలో కట్టుకున్న భక్ష్యాల పొట్లాలూ అవీ కింద పడ్డాయి. అందరూ గొల్లున నవ్వారు. మైనా వతికి అవమానంతో దుఃఖం పొంగివచ్చింది.

రాజు ఆమె చెయ్యి పట్టుకుని అవతల తన గదిలోకి తీసుకుపోయి, "విచారించకు. నన్ను గుర్తించలేదా? మీసాల పోతునూ, గడ్డంవాణ్ణీ, నీ కుండలను గుర్రంచేత తొక్కించిన వేటగాణ్ణీ నేనే. మీ నాన్నగారికి నేనని తెలిసే నిన్ను నాకు పెళ్లిచేశారు. అందుచేత నీకిప్పుడు జరిగిన నష్టంగాని, వచ్చిన కష్టంగాని ఏమీ లేదు. మనిషికి అంత అదిరిపాటు పనికిరాదని తెలియజెప్ప టానికే ఈ నాటకం ఆడాను," అన్నాడు.

అప్పటికే మైనావతి అదిరిపాటంతా అణ గారి పోయింది. ఆమె తన భర్తతో సుఖంగా కాపరం చేసి, అంత మంచి మనిషి మరొకతె ఉండదనిపించుకుంది.





దాచిపెట్టిన వీలునామా

అయిదారు వందల సంవత్సరాలక్రితం చీనా దేశంలోని ఒక రాష్ట్రానికి "నీ షౌ-చియెన్" అని రాజప్రతినిధి ఉండేవాడు. ఆయన బోలెడంత డబ్బూ, ఇళ్ళూ, పొలాలూ సంపాదించాడు. ఆయనకు షాన్-చీ అని ఒకడే కుమారుడు. అతనికి పెళ్ళి అయాక తల్లి చనిపోయింది. ఆ తరవాత రాజప్రతినిధి "నీ" తన ఉద్యోగానికి రాజీనామా పెట్టి, ఇళ్ళూ, పొలాలూ చూసుకోసాగాడు.

"నాన్నగారూ, మీరు పెద్దవారైపోయారు గదా, హాయిగా విశ్రాంతి తీసుకోండి. వ్యవహారాలు చూసే పని నాకు వదిలెయ్యండి," అన్నాడు షాన్-చీ.

"నా బొందెలో ఊపిరి ఉండగా నా వ్యవహారాలు మరొకరు చూడటమేమిటి?" అన్నాడు "నీ". ఆయన అంతటితో పోనివ్వక, కొడుకుకు ఏమాత్రమూ సహించరాని మరొక పనికూడా చేశాడు: ఆయన ఒక నాడు గ్రామం వెంబడి షికారుగా నడుస్తూ ఉండగా రేవువద్ద బట్టలు ఝాడించుతూ ఒక పదహారేళ్ళ పిల్లా, ఆమె అమ్మమ్మా కనిపించారు. ఆ పిల్లపేరు మేయ్; ఆమెకు చిన్నతనంలోనే తలిదండ్రులు పోగా, పేదదైన అమ్మమ్మ దగ్గిర పెట్టుకుని సాకుతున్నది. మేయ్‌కి ఇంకా ప్రధానం జరగలేదు. ఆమెను చూసేసరికి "నీ"కి ఎంతో ముచ్చట అయింది. ఆయన ముసలావిడతో మాట్లాడి ఆ పిల్లను తన కిచ్చి పెళ్ళిచెయ్యమనీ, అలా చేసినట్టయితే ముసలిది బతికి ఉన్నంతకాలమూ సుఖంగా పోషిస్తాననీ, పిల్లకూడా గొప్పయింటి యజమానురాలై పదవీ పలుకుబడీ గలది అవుతుందనీ చెప్పాడు. ఈ మాటలకు ముసలిది సంతోషించింది. మేయ్ అభ్యంతరం చెప్పలేదు. మేయ్‌ని వయసుమళ్ళిన "నీ" పెళ్ళాడేసి తన ఇంటికి తెచ్చుకున్నాడు. మేయ్ వయ



సులో చిన్నదయినా దొడ్డబుద్ధి గలదని "నీ" సులువుగా గ్రహించాడు.

అయితే ముసలితనంలో తండ్రి చేసుకున్న పెళ్లి షాన్-చీకి గాని, అతని భార్యకు గాని నచ్చలేదు. మేయ్ మాయలాడి అనీ, ముసలివాణ్ణి ఎలాగో బుట్టలో వేసిందనీ, ఆమె మూలంగా వంశగౌరవం కాస్తా మంట గలిసిపోతుందనీ వాళ్ళు నానా మాటలూ అనుకున్నారు.

త్వరలోనే మేయ్ గర్భవతిగా ఉండి కాలక్రమాన ఒక మగబిడ్డను కన్నది. వాడికి తండ్రి షాన్-షూ అని పేరు పెట్టుకున్నాడు. తనకు తమ్ముడు పుట్టాడని సంతోషించటానికి బదులుగా, దుర్మార్గుడైన షాన్-చీ మళ్ళీ తన సవతితల్లిపై అభాండాలు వేశాడు; ఆమె కులట అనీ, షాన్-షూ నిజంగా తన తమ్ముడు కాడనీ అందరితోటీ అనేశాడు.

షాన్-చీ పేలే కారుకూతలన్నీ తండ్రికి తెలియవస్తూనే ఉన్నాయి, కాని ఆయన పైకి ఏమీ అనలేదు, అంతా కడుపులో పెట్టుకుని ఊరుకున్నాడు. తన ఆస్తిని తమ్ముడితోపాటు పంచుకోవలసి వస్తుందన్న ఏడుపుమూలంగానూ, ఎప్పటికైనా ఏదో మిషమీద ఆ పసివాడికి ద్రోహంచేసే ఉద్దేశంతోనూ షాన్-చీ ఇలాంటి ప్రచారం చేస్తున్నాడని కూడా ఆయన గ్రహించాడు.

షాన్-షూకు అయిదేళ్లు నిండగానే వాణ్ణి ఒక పంతులు దగ్గిరికి పంపారు. ఆ పంతులు దగ్గిరే షాన్-చీ కొడుకు కూడా చదువుతున్నాడు. తన కొడుకుకూ, తమ్ముడికీ ఎక్కడ సఖ్యత ఏర్పడిపోతుందోనని, షాన్-చీ తన కొడుకును ఆ బడి మాన్పించి మరొక పంతులుదగ్గిర పెట్టాడు. ఇది చూసి "నీ" మండిపడి, కొడుకును గట్టిగా మందలించుదామనుకున్నాడు; కాని దుర్మార్గుడితో మాట్లాడి ప్రయోజనం లేదని ఆ ఉద్దేశం మానుకున్నాడు.



తరవాత కొద్దిరోజులకే "నీ" పక్షవాతం వచ్చి పడిపోయాడు. వైద్యుడు వచ్చి చూసి, "పక్షవాతానికి మందు లేదు. ఇలాగే కొంత కాలం మంచంలో తీసుకుని తరవాత పోవలిసిందే!" అన్నాడు.

షాన్-చీ తండ్రిని చూడటానికి వచ్చి, ఆయన ఇక లేచి తిరిగే అవకాశం లేదని తెలుసుకుని, తన అధికారం సాగించ నారంభించాడు; అప్పుడే తాను ఇంటి యజమాని అయిపోయినట్టు, అయినదానికీ కానిదానికీ నౌకర్లను కొట్టసాగాడు. మేయ్, షాన్-షూలు ముసలాడి మంచాన్నే అంటిపెట్టుకుని దుఃఖించసాగారు.

"నీ" తన అవసానకాలం ఆసన్నమయిందని గ్రహించి, ఒకనాడు తన పెద్ద కొడుకైన షాన్-చీని పిలిచి, అతనికి ఒక పుస్తకం ఇచ్చాడు; ఆ పుస్తకంలో "నీ" తాలూకు ఆస్తి వివరాలు ఉన్నాయి.

ఆయన తన పెద్ద కొడుకుతో, "షాన్-షూ అయిదేళ్ళ పసివాడు. కొంతకాలం వాడు ఎవరో ఒకరి పోషణలో ఉండాలి. వాడి తల్లి కూడా పాలాలూ పుట్రా చూసుకోదగినంత ఈడుగలది కాదు. అందుచేత ఆస్తిలో వాళ్లకిప్పుడు నేను వాటా ఇవ్వటంలేదు, అంతా నీపరమే చేస్తున్నాను. షాన్-షూ పెద్దవాడయాక వాడికి పెళ్లి చెయ్యి, వాడికి ఒక చిన్న ఇల్లూ, పది ఎకరాల పొలమూ ఇయ్యి, లేకపోతే వాడు ఇంటికీ, తిండికీ ఇబ్బంది పడగలడు. ఈ విషయాలన్నీ ఈ పుస్తకంలో రాసిపెట్టాను. మీరు విభాగాలు పడటానికి ఇది ఆధారంగా ఉంటుంది. నా రెండోభార్య తిరిగి పెళ్లాడగోరే పక్షంలో పెళ్లాడనీ, విధవరాలుగా ఉండిపోయి తన కొడుకు వెంటే ఉండిపోతానంటే నువ్వేమీ ఒత్తిడిచెయ్యకు. నేను పోయాక నేను చెప్పినట్టుగా చేస్తివా నా ఆత్మకు శాంతి ఉంటుంది!" అన్నాడు.

"నాన్నగారూ, మీరేమీ విచారించకండి. అక్షరాలా మీరు చెప్పినట్టే జరిపిస్తాను!"

అంటూ షాన్-చీ తండ్రి ఇచ్చిన పుస్తకం తీసుకుని పరమానందంతో వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయాక మేయ్ తన భర్తతో "వీడుమాత్రం మీ కొడుకు కాడా? అంతా మీ పెద్దవాడి చేతిలో పెట్టి వాడికే మీ లేకుండా చేశారేమిటి? మేం ఎలా బతకాలి?" అన్నది కంట నీరు పెట్టుకుంటూ.

"నీకు తెలియదు. షాన్-చీని నమ్మటానికి లేదు. ఇప్పుడు నేను ఆస్తిని ఇద్దరికీ సమంగా పంచానంటే, వాడు చిన్నవాడి ప్రాణాలు తీసెయ్యగలడు. అంతా వాడి మొహానే కొడితే వాడికి అసూయ పుట్టదు. నువుకూడా చిన్నదానివే గనక పిల్లవాడి పోషణభారం షాన్-చీపై పెట్టాను. నేను పోయాక, నువు ఇక్కడే ఉండి కష్టాలు పడకు, తగిన భర్తను చూసి మళ్ళీ పెళ్ళి చేసుకుని యావజ్జీవం సుఖంగా ఉండు," అన్నాడు.

"మాదికూడా పరువుగల వంశమే. నేను మళ్లీ పెళ్లిచేసుకుని నా కొడుక్కు దూరమౌతానా? కష్టమో, సుఖమో పిల్లవాడివెంటే ఉంటాను!" అన్నది మేయ్.

ఆమె అభిప్రాయం మార్చుకోదని రూఢి చేసుకుని "సీ" అమెతో, "అలా అయే పక్షంలో నీకూ, నీ కొడుక్కూ ఏ లోటూ లేకుండా చేస్తాను," అంటూ తన తలగడా



కిందినుంచి ఒక "చుట్ట" పైకి తీసి ఆమె చేతికిచ్చాడు.

"ఇది ఏమిటి?" అని అడిగింది మేయ్.

"ఇది నా చిత్తరువు. ఇందులో ఒక రహస్యమున్నది. ఎవరికీ చూపకుండా దీన్ని నీవద్ద దాచుకో. నీ కొడుకు పెరిగి పెద్దవాడయాక వాడికి షాన్-చీ సహాయంచెయ్య నిరాకరించినట్టయితే, ఈ ప్రాంతాలకు తెలివిగలవాడూ, న్యాయబుద్ధి గలవాడూ అయిన న్యాయాధికారి వచ్చినప్పుడు, అయనకీ చిత్తరువు చూపి ఫిర్యాదుచెయ్యి. ఈ బొమ్మను శ్రద్ధగా చూసినాక అయన నీకూ, నీ కొడుక్కూ సుఖంగా జరిగిపోయేలాగా తీర్పు చెబుతాడు," అన్నాడు "నీ". తరవాత కొద్దిరోజులకు ఆయన పోయాడు.

తండ్రి చావగానే షాన్-చీ తాళపు చెవులన్నీ స్వాధీనం చేసుకున్నాడు; ముసలివాడి అంత్యక్రియలు పూర్తి అయాక, ఇల్లు మరమ్మతు చేసే మిషమీద తన సవతి తల్లినీ, సవతితమ్ముణ్ణీ వాళ్ల గదులలోనుంచి కదిలించి, దొడ్లోఉండే మూడుగదుల కుటీరంలో వారికి నివాసం ఏర్పాటుచేశాడు. వాళ్లకు చాకిరిచెయ్యటానికి ఒక చిన్నపిల్లను మాత్రమే ఇచ్చాడు. రోజూ వారికి కావలిసిన బియ్యంమటుకు పంపేవాడు, కూరా నారా పంపేవాడుకాడు. కూరలకూ, ఇతర





ఇంటి ఖర్చులకూ అవసరమైన డబ్బు మేయ్ కుట్టుపని చేసి సంపాదించేది.

షాన్-చీ తన మనుషుల్లో ఒకరిని, సవతి తల్లి వద్దకు పంపి, ఆమె తిరిగి పెళ్లాడితే బాగుంటుందని చెప్పించాడు, మనువులు కుదిర్చేవాళ్లనికూడా అమె వద్దకు పంపించాడు. తాను చచ్చినా తిరిగి పెళ్ళాడనని మేయ్ అందరితోనూ చెప్పేసింది. ఆ తరవాత షాన్-చీ ఆమెను గురించీ, ఆమె కొడుకును గురించీ పట్టించుకోవటం మానేశాడు.

ఏళ్లు దొర్లిపోయాయి. షాన్-షూ పధ్నాలుగేళ్లవాడయ్యాడు. ఒకనాడు వాడు తన తల్లితో, "అమ్మా, నాకు సిల్కుబట్టలు కుట్టించు," అన్నాడు. డబ్బు లేదన్నది తల్లి. "మా నాన్న రాజప్రతినిధి. ఉన్నది ఇద్దరమే కొడుకులం. అన్నకు అంత డబ్బుంటే నాకు కొత్తబట్టలకు డబ్బెందుకు లేకపోవాలి? నీ దగ్గిర లేకపోతే అన్న నడుగుతాను," అన్నాడు. తల్లి అలా ఎన్నడూ చెయ్యవద్దన్నది.

అందుకని వాడు తల్లికి తెలియకుండా అన్నవద్దకు వెళ్లి, "నాన్న చాలా గొప్పవాడు. నేను వేసుకునే బట్టలు చూసి అందరూ నవ్వుతున్నారు. అన్నా, నాకు కొంత సిల్కు ఇప్పించు, కొత్తబట్టలు కుట్టించుకుంటాను," అన్నాడు.

"కొత్తబట్టలు కావాలంటే మీ అమ్మ నడుగు!" అన్నాడు షాన్-చీ.

"ఆస్తి చూస్తున్నది నువే కద, మా అమ్మ కాదే!" అన్నాడు షాన్-షూ.

"వెధవా, నువు బట్టలడగవచ్చావా? భాగం అడగవచ్చావా? ఆస్తి నాదీ, నా పిల్లలదీనూ! మధ్య నువ్వెవడివి?" అంటూ తమ్ముడి నెత్తిన గట్టిగామొట్టాడు షాన్-చీ. నెత్తి బొప్పికట్టి, ఏడుస్తూ కుర్రవాడు తల్లి దగ్గిరికి పోయి జరిగిన సంగతి చెప్పాడు.

"వెళ్లవద్దంటిని కదా, నీకు జరగవలిసిందే!" అంటూనే తల్లి తన కొడుకు తల

నిమిరి, తన కన్నీళ్లతో తడిపింది. తరవాత ఆమె పాన్-చీకి క్షమాపణ చెప్పిరమ్మని దాసీని పంపుతూ, "తెలియక కుర్రవెధవ అన్న మాటలకు కోపం తెచ్చుకోవద్దు," అని చెప్పి పంపించింది.

అయినప్పటికీ పాన్-చీ కోపం చల్లారక మర్నాడు ఉదయం తన బంధువుల నందరినీ పిలిపించి, మేయ్ పాన్-షూల ఎదట వారితో ఇలా అన్నాడు: "పెద్దలందరూ చిత్తగించాలి. పాన్-షూనూ, అతని తల్లినీ పోషించటం నా కిష్టంలేదనుకోకండి. వాళ్లని వెళ్లగొట్టాలనే ఉద్దేశంకూడా నాకు లేదు. కాని నిన్న పాన్-షూ వచ్చి నాతో ఆస్తి గురించి తగాదాపెట్టాడు. ఇప్పుడే ఇలా ఉంటే, ముందేంచేస్తాడో చెప్పలేం. అందుచేత వారికి మీ అందరి ఎదటా మా నాన్నగారు రాసిపెట్టిన ప్రకారం వంతు ఇచ్చేస్తాను. తూర్పువేపున ఉన్న ఇల్లూ, ఇరవైతొమ్మిది కుంటల పొలమూ ఇకనుంచీ వారిది. నాన్నగారు వీలునామాలో రాసినది తూచా తప్పటంలేదు. ఇందుకు మీరే సాక్షులు," అంటూ తనకు తండ్రి ఇచ్చిన పుస్తకం చూపాడు.

ఇందుకు అందరూ సమ్మతించారు. కొందరికి ఇది అన్యాయమని తోచికూడా



అభ్యంతరం చెప్పక, "చాతయినవాడెవడూ తండ్రి ఆస్తి తింటూ కూచోడు. కష్టపడి పనిచేసేవాడికి కరువుండదు. ఏమీ లేకుండా జీవితం ఆరంభించి లక్షాధికార్లయినవాళ్లున్నారు," అన్నారు.

తరవాత తల్లికొడుకులు తమకున్న కొద్ది సామాన్లతో తూర్పు ఇంటికి వెళ్లిపోయారు. అది చాలా పాత ఇల్లు, చాలా గదులు కురుస్తాయి. ఒకటి రెండు మంచి గదులు శుభ్రం చేసుకుని వారు వాటిలోనే కాలక్షేపం చేయసాగారు. వారి వంతు వచ్చిన భూమికూడా వట్టి షర్ర. పంటలు పాడైన ఏడు అందులో నుంచి చల్లినన్ని గింజలుకూడా రావు.

కొద్దికాలం గడిచింది. వారుండే గ్రామానికి ఒక కుశాగ్రబుద్ధి అయిన న్యాయాధికారి కొత్తగా వచ్చినట్టు మేయ్‌కి తెలియవచ్చింది. ఆ గ్రామంలో కొంతకాలం క్రితం ఒక దర్జీవాణ్ణి ఎవరో హత్యచేశారు. దర్జీవాడి భార్య గ్రామంలోని ఒక మనిషిపైన హత్యానేరంమోపి పాతన్యాయాధికారివద్ద ఫిర్యాదు చేసింది. ఆ న్యాయాధికారి ఆ ఆరోపణను నమ్మి ముద్దాయికి మరణశిక్ష విధించాడు. ఇంతలో ఈ కొత్త న్యాయాధికారి వచ్చి, అసలు హంతకుణ్ణి యుక్తిగా కనిపెట్టి, నిర్దోషి అయిన ముద్దాయిని విడిచిపెట్టాడు. ఆయనను అందరూ మెచ్చుకున్నారు.

అలాటివాడి ద్వారానే తనకూ, తన కొడుక్కూ న్యాయం జరగాలనుకుని, తన భర్త చిత్తరువు తీసుకునివెళ్ళి న్యాయాధికారి కిస్తూ, "షాన్-చీ నా భర్త ఆస్తి అంతా స్వాధీనపరుచుకుని నా కొడుక్కు సగభాగం ఇవ్వటంలేదు. తమరు న్యాయం జరిపించాలి. పోయేటప్పుడు నా భర్త ఈ చిత్తరువును నా కిచ్చి, తన అసలు వీలునామా రహస్యం ఇందులో ఉందనీ, తెలివైన న్యాయాధికారి ఆ రహస్యం తెలుసుకోవచ్చుననీ అన్నారు," అన్నది.

న్యాయాధికారి ఆమెను పంపేసి చిత్తరువుకేసి చాలాసేపు చూశాడు, కాని ఆయన



కేమీ బోధపడలేదు. చివర కాయన గుడ్డకు అంటించి ఉన్న బొమ్మను ఊడదీయగా, బొమ్మచాటున ఒక కాగితంలో ఇలా రాసి ఉన్నది: "నేను వృద్ధుణ్ణి. నా రెండవ కొడుకు పాన్-షూ పసివాడు. నా పెద్ద కొడుకు పాన్-చీ దుర్మార్గుడు, వాడు తమ్ముడికి ద్రోహంచెయ్యవచ్చు. నా పొలాలూ, రెండు భవంతులూ పాన్-చీకి ఇచ్చివేస్తున్నాను. తూర్పున ఉన్న ఇల్లు పాన్-షూకు చెందవలెను. ఈ ఇల్లు పాతదైనప్పటికీ దీని యొక్క తూర్పుగోడకింద అయిదు జాడీలలో ఇరవైమణుగుల బరువుగల వెండీ, పడమటిగోడకింద అలాగే అయిదు జాడీలలో ఇరవైమణుగుల వెండీ, ఆరవజాడీలో నాలుగుమణుగుల బంగారమూ ఉన్నది. భూమికి ప్రత్యామ్నాయంగా ఈ వెండి బంగారాలు నా చిన్నకొడుకైన పాన్-షూకు చెందవలెను."

దీనిపైన ముసలివాడి సంతకమూ, తేదీ ఉన్నాయి.

మర్నాడు న్యాయాధికారి పాన్-చీని పిలిపించాడు. ఆయన అతడితో, "నీపైన మీ సవతితల్లి ఫిర్యాదు తెచ్చింది. నువు మీ సవతి తమ్ముడికి సక్రమంగా నీ తండ్రి ఆస్తిలో భాగం పంచలేదట. ఆ సంగతి నిజమేనా?" అన్నాడు.





"ప్రభువులు చిత్తగించాలి. నావద్ద మా తండ్రిగారి వీలునామా ఉన్నది. అందులో ఆయన నా తమ్ముడికి ఏమేమి ఇవ్వమని రాశారో అదంతా ఇచ్చేశాను. ఆ వీలు నామాను తమరుకూడా చిత్తగించవచ్చు," అన్నాడు షాన్-చీ.

"సరే, రేపు ఉదయం నేను మీ ఇంటికి వచ్చి మీ తండ్రిగారి వీలునామా స్వయంగా చూశాక తీర్పు ఇస్తాను," అన్నాడు న్యాయాధికారి. ఆయన షాన్-చీని పంపేసి, మర్నాడు ఉదయం షాన్-చీ ఇంటివద్ద కొడుకుతోసహా హాజరు కావలిసిందని మేయ్‌కి వర్తమానం పంపాడు.

షాన్-చీ మర్నాడు ఉదయం తన ఇంటి చావడి చక్కగా అలంకరించి, న్యాయాధి కారి కూర్చోటానికి ఒక కుర్చీమీద పులి తోలు పరిపించి, తన బంధువుల నందరినీ పెందలాడే రమ్మని కబురుపెట్టాడు. వారంతా వచ్చారు.

త్వరలోనే మేనాకుర్చీ ఎక్కి, భటులను వెంటబెట్టుకుని, న్యాయాధికారి వచ్చాడు. బోయీలు మేనాకుర్చీని వాకిలి దగ్గిరగా దించారు. న్యాయాధికారి వాకిలిదాకా వచ్చి, ఎవరో కనిపించినట్టుగా వంగి మర్యాద చేసి, లోపలికి దారి చూపుతూ, "దయ చెయ్యండి!" అన్నాడు. ఆ తరవాత ఆయన ఎవరినో వెంటపెట్టుకుని వచ్చేవాడి లాగా మాట్లాడుతూ లోపలికి వచ్చి, ఆ కన పడని వ్యక్తికి పులితోలుకుర్చీ చూపించి, "ఆ ఆసనం అలంకరించండి!" అంటూ తాను మరొక కుర్చీలో కూచున్నాడు. ఆయన ఇంకా ఎవరితోనో మాట్లాడుతున్న ట్టుగా, "మీ భార్యగారు నావద్ద ఫిర్యాదు తెచ్చింది. ఆ విషయం ఎలా పరిష్కరించ మని తమ సలహా?...అలాగా? మీ పెద్దబ్బాయి ప్రవర్తన ఏమీ బాగాలేదే! మీ చిన్నకుమారుడికి ఏమి ఇద్దామనుకున్నారు? తూర్పు ఇల్లా? మరి అతను బతికే

ఉపాయం?...అలా చెప్పండి! చిత్తం, అలాగే చేస్తాను. అదంతా మీ చిన్నవాడి కేనా? మీరు చెప్పినదంతా నేను అమలు జరిపిస్తానులెండి!" అన్నాడు.

న్యాయాధికారి ఏదో దయ్యంతో మాట్లాడు తున్నాడనుకుని అక్కడ చేరినవారంతా కంగారుపడ్డారు. వా రాయనను పలకరించ టానికే భయపడ్డారు. చివరకాయన లేచి నిల బడి వంగి, "సరే ఇక నాకు సెలవిప్పి స్తారా?" అని మళ్ళీ నిటారుగా నిలబడి అశ్చర్యంతో చుట్టూ కలయజూశాడు. తర వాత అయన షాన్-చి కేసి తిరిగి, "ఇప్పుడు నాతో మాట్లాడుతున్నారు, ఇంతలో మీ నాన్న గారు ఎటు వెళ్ళారు? మా సంభాషణ నువు విన్నావుగా?" అన్నాడు.

"నేను వినలేదు, అంతా అశ్చర్యంగా వుంది," అన్నాడు షాన్-చీ.

"ఎత్తు మనిషి, కోలమొహం, దవడ ఎముకలు ఎత్తుగా ఉంటాయి, బాదంకాయ కళ్ళు, పొడుగాటి కను బొమలు, పెద్ద చెవులు, పలచ పలచని తెల్ల గడ్డం, అధి కారులు ధరించే టోపీ పెట్టుకున్నారు. నల్లటి బూట్లు, ఎర్రని లుంగీ, నడుముకు బంగారు పట్టీ పెట్టుకున్నారు. అయన రాజ ప్రతినిధి "న్,'' యేగా?" అన్నాడు న్యాయాధికారి.



"బతికుండగా అచ్చు అలాగే ఉండే వారు," అన్నారు బంధువులు. న్యాయాధికారి వర్ణించింది చిత్తరువు ఆధారంతో. కాని ఆ సంగతి ఎవరికీ తెలియదు. చచ్చిపోయిన మనిషి కనిపించాడనే అనుకున్నారు.

"మీకు రెండిళ్ళూ, తూర్పున మరొక ఇల్లూ ఉండటగా. ఆ ఇంటిదగ్గిరికి పోదాం. అక్కడ మిగిలిన విషయాలు చెబుతాను," అన్నాడు న్యాయాధికారి. షాన్-చీ ఆయనను వెంటబెట్టుకుని తూర్పు ఇంటికి వెళ్ళాడు.

"ఈ ఇల్లు మీ తమ్ముడికివ్వటం సమ్మతమేనా?" అని న్యాయాధికారి అడిగాడు. షాన్-చీ, "చిత్తం! చిత్తం!" అన్నాడు.

న్యాయాధికారి ఆ ఇంటి మధ్యగదిలో కూచుని పుస్తకం తిరగవేసి, "ఇందులో అంతా స్పష్టంగానే ఉన్నది. షాన్-షూకు ఇంతకంటె మరేమీ రాదు," అన్నాడు.

మేయ్ దుఃఖంతో కుమిలిపోయి, తన కొడుక్కు న్యాయం జరగదనుకున్నది.

"అయితే ఈ ఇంట్లో నలభై మణుగుల వెండీ, నాలుగు మణుగుల బంగారమూ పాతిపెట్టి ఉన్నట్టు మీ నాన్నగారింతకు ముందే నాతో చెప్పారు. అదికూడా షాన్-షూకే చెందుతుంది," అన్నాడు న్యాయాధికారి. ఈ మాటను షాన్-చీ నమ్మలేదు. అతను "ఎన్ని మణుగులున్నా అది షాన్-షూ సొత్తే. నేనభ్యంతరం పెట్టను," అన్నాడు.

"పెడితే నేను ఊరుకుంటానా ఏమిటి?" అంటూ న్యాయాధికారి తూర్పుగోడకింద తవ్వించాడు. అయిదు జాడీలనిండా వెండి బయటపడింది, అలాగే పడమటి గోడకింద తవ్వగా మరో అయిదు జాడీలలో వెండీ, అరపజాడీలో బంగారమూ బయట పడింది.

న్యాయాధికారి ఆ వెండి బంగారాలను షాన్-షూ పరంచేశాడు. తన తమ్ముడితో తండ్రి ఆస్తి సవ్యంగా పంచుకున్నట్టయితే ఆ వెండి బంగారాలలో తనకు సగంవాటా వచ్చేదిగదా అని షాన్-చీ కుమిలిపోయాడు.





[15]

ఈ సమయానికే శుద్ధోదన మహారాజు మరణించాడు. ఆయనకు అంత్యక్రియలు జరుగుతున్నాయి. ఆ కారణంచేత బుద్ధుడు కపిలవస్తు సమీపంలో ఉన్న నిగ్రోధారామ విహారానికి వచ్చాడు. ప్రజాపతి బుద్ధుడి వద్దకు వెళ్ళి, "నాయనా, శుద్ధోదన మహారాజు దేహం చాలించాడు. రాహులుడూ, నందుడూ కూడా నీ అనుచరులైపోయారు. నేనిక ఒంటరి జీవితం గడపలేను. నన్నూ, నా వెంట ఉన్న ఈ 500 మంది స్త్రీలనూ నీ అనుచరులుగా స్వీకరించి, మాకు సన్యాసం ఇప్పించు," అన్నది.

స్త్రీలను శిష్యురాళ్లుగా తీసుకున్నట్టయితే పామరుల దృష్టిలో తన అనుచరులూ, ఉద్యమమూ అపఖ్యాతి పాలవుతుందని శంకించి, "స్త్రీల మూలంగా నా ఉద్యమం అపవిత్రమవుతుంది," అన్నాడు బుద్ధుడు. ప్రజాపతి ఎంత ప్రాధేయపడినా బుద్ధుడు తన మనసు మార్చుకోలేదు.

అయన నిగ్రోధారామంనుంచి కదిలి విశాలానగర సమీపాన ఉండే కూటాగార శాలకు వెళ్ళాడు. ప్రజాపతి తనవెంట ఉన్న స్త్రీలను తీసుకుని అక్కడికి వెళ్ళింది. ఈ సారి రాజకుమార్తెలు తమ కేశాలను ఖండించుకుని, సన్యాసి దుస్తులు ధరించి, మట్టితో చేసిన భిక్షాపాత్రలు పట్టుకుని, కాలి నడకను విశాలానగరానికి వచ్చారు. మేడపై అంతస్తునుంచి కిందికి దిగితేనే కందిపోయే



టంత సౌకుమార్యం గల ఈ స్త్రీలు ఇంత దూరం నడిచేసరికి వారి పాదాలు బొబ్బలెక్కాయి. వీరు కాలినడకన వెళుతున్నారన్న వార్తలు విని వీరిని చూడటానికి తండోపతండాలుగా జనం వచ్చారు. కొందరు వారికి తమ ఇళ్ళనుంచి ఆహారం తెచ్చి ఇచ్చారు. మరికొందరు వారిని డోలీలలోనూ, మేనాలలోనూ తీసుకుపోతామన్నారు. కాని స్త్రీలు ఇలాటి సహాయాలన్నిటినీ నిరాకరించి, యాభైఒక్క యోజనం దూరం నడిచి విశాలానగరం చేరారు.


వారు బుద్ధుడి విహారాన్ని చేరుకునేసరికి సాయంకాల మయింది, వారు లోపలికి



వెళ్ళక బయటనే ఆగారు. ఆనందుడు ఎక్కడినుంచో వస్తూ వారిని చూశాడు. పాదాల నెత్తురు కారుతూ, దుమ్ముకొట్టుకుని, సగం చచ్చిఉన్న ఆ స్త్రీలను చూసేసరికి అతని మనసులో భరించరాని వేదన కలిగింది. అతను కన్నుల నీరు కారుస్తూ, "మీరంతా ఇలా ఎందుకు వచ్చేశారు? శాక్యులను శత్రువులు నగరంనుంచి తరిమివేశారా? బుద్ధుడి తల్లి ఇలాటి చోటికి ఎందుకు రావలిసి వచ్చింది?" అని అడిగాడు. ప్రజాపతి ఆనందుడికి సంగతి యావత్తూ చెప్పింది. అతను వారిని అక్కడే ఉండమని లోపలికి వెళ్ళి, బుద్ధుడితో ఆ స్త్రీలను గురించి చెప్పి, వారి కోరికను తెలియబరిచాడు. "ఆనందా, మన ఆశ్రమంలో ఆడవారిని చేర్చటానికి యత్నించకు!" అన్నాడు బుద్ధుడు. "మనలో చేరటానికి రాజమాత కూడా అర్హురాలుకాదా?" అని ఆనందుడు అడిగాడు. బుదుడు వెనకటి సమాధానమే చెప్పాడు.

"స్త్రీని శిష్యగణంలో చేర్చుకుంటే ఆమె దానివల్ల తరించదా?" అని ఆనందుడు మళ్ళీ అడిగాడు.

దానికి బుద్ధుడు, "బుద్ధులు జన్మించేది కేవలం పురుషులను తరింపచేయటానికే





కాదు. నా ప్రబోధాలు విని ఎంతమంది స్త్రీలు, విశాఖ మొదలైనవారు, ఉపాసికలు కాలేదు ?" అన్నాడు.


"స్వామీ, అలాఅయితే స్త్రీలనుకూడా మనం స్వీకరించవచ్చు, మీకు ముందు అవతరించిన ఇరవైనలుగురు బుద్ధులూ స్త్రీలను చేరదీసినట్టు మీరే ఒకప్పుడు చెప్పి ఉన్నారు," అన్నాడు ఆనందుడు.

ఈ మాటలకు బుద్ధుడు సుముఖుడయాడుగాని పైకి ఏమీ అనలేదు, అనుమతికూడా ఇవ్వలేదు.

"స్త్రీలను శిష్యురాళ్ళుగా చేర్చుకోవచ్చునని తేలిపోతున్నది. అలాటప్పుడు, బుద్ధుడికి ఎంతో సేవ చేసిన ప్రజాపతిని చేర్చుకోవటానికి అభ్యంతరమేమిటి?" అని ఆనందుడు అడిగాడు.

బుద్ధుడు ఆలోచించి, "ఎనిమిది నియమాలు పాటించినట్టయితే ప్రజాపతి మనలో చేరవచ్చు," అన్నాడు.

ఆనందుడు స్త్రీల వద్దకు తిరిగివచ్చి బుద్ధుడు చేసిన ఎనిమిది నియమాలనూ వారికి తెలియజేశాడు. వారు వాటిని పాటించటానికి ఒప్పుకున్నారు. అందరి సమక్షంలో వారు ఆశ్రమంలోకి స్వీకరించబడ్డారు. ప్రజాపతి స్త్రీలకు పెద్దగా నియోగించబడింది. తరవాత కొద్దికాలానికే ఆమె భావనా






సమాధిద్వారా అర్హతురాలయింది. అది మొదలు స్త్రీలు అంతులేని సంఖ్యలో విహారానికి వచ్చి బుద్ధుడి వెంట సన్యాసినులుగా చేరారు.

కొంతకాలం గడిచింది. ప్రజాపతికి నిర్వాణం చెందాలన్న కోరిక కలిగింది. బుద్ధధర్మం అవలంబించినవారిలో అప్పటికి నిర్వాణం చెందినవారు లేరని ఆమె తెలుసుకున్నది. ఆమె బుద్ధుడితో, "నాయనా, నీ శిష్యులలో మొట్టమొదటగా నిర్వాణం చెందాలని ఉన్నది. అందుకు అనుమతించి, నా వల్ల ఏవైనా అపచారాలు జరిగిఉంటే క్షమించు!" అన్నది.

"చింతామణీ వజ్రాన్ని సానపట్టటం ఎంత అనవసరమో నిన్ను క్షమించడం అంత అనవసరం. అదీగాక నిర్వాణాన్ని అందుకున్నవారు ఒకరినొకరు క్షమించనవసరం లేదు. నన్ను అనుసరించినవారిలో మొదట నిర్వాణం పొందే మహాభాగ్యం నీకే దక్కుతుంది," అన్నాడు బుద్ధుడు.

అన్యకౌండిన్యుడూ, రాహులుడూ మొదలైనవారి సమక్షంలో ప్రజాపతి దేహం చాలించింది. ఆమె అంత్యక్రియలకు బుద్ధుడి అనుచరులందరూ ఆహ్వానించబడ్డారు. ఆమె దహనక్రియలప్పుడు దేవతలు ఆమెకోసం విమానంతో వచ్చారనీ, ఈ గౌరవం బుద్ధు



డికిగాని, ఆయన శిష్యులలో మరి ఏ ఒక్క రికిగాని జరగలేదని చెబుతారు.

ప్రజాపతితోబాటు ఆమె వెంట ఉండిన అయిదువందలమంది రాజకుమార్తెలూ దేహాలు చాలించారు. అందరికీ ఒకేసారి చందన కాష్ఠాలతో దహనక్రియలు జరిగాయి. ప్రజాపతి శరీరం దహనమైన చోట ఆనందుడికి ముత్యాల రాశి కనబడిందట. వాటిని జాగ్రత్తగా తీసి ఆనందుడు బుద్ధుడి భిక్షాపాత్రలో పోశాడట.

* * *

బుద్ధుడికి ఎన్నో జన్మలు భార్యగా ఉండిన యశోధరాదేవి బుద్ధుడు పుట్టిన రోజునే పుట్టింది. సిద్ధార్థుడు ఇల్లు విడిచి వెళ్లినాక తానుకూడా సన్యాసిని కావాలని ఎంతో ప్రయత్నం చేసింది, కాని శుద్ధోదనమహారాజు ఆమె ప్రయత్నాలు సాగకుండా పహరా ఏర్పాటుచేశాడు. "నీ భర్త తిరిగి వస్తాడు," అని ఆమెకు నచ్చచెప్పాడు. అత్యంత సౌందర్యవతి అయిన యశోధరను భర్త విడిచి వెళ్ళాడని తెలియగానే అనేకమంది రాజకుమారులు ఆమెను ఎత్తుకుపోవటానికి ప్రయత్నిస్తారనికూడా ఆయన భయపడ్డాడు.

ఆమె ఇల్లు వదలనప్పటికీ సన్యాసినివేషం ధరించి మట్టిపాత్రలో భోజనంచేస్తూ సన్యాస





వ్రతం అవలంబించింది. బుద్ధుడు కపిలవస్తు నగరానికి వెళ్లిన మర్నాడు తనను చూడవచ్చినప్పుడామె ఆయన శిష్యగణంలో చేరటానికి అనుమతి వేడింది, కాని బుద్ధుడు అనుమతి నిరాకరించాడు.

రాహులుడు బౌద్ధ సన్యాసి అయినప్పుడామె ఎంతో దుఃఖించింది. అప్పుడు శుద్ధోదన మహారాజు ఆమెకు హితోపదేశం చేసి ఊరడించాడు. శుద్ధోదన మహారాజు చనిపోయాక ఆమె బుద్ధుడివెంట చేరుదామనుకున్నది. కాని బుద్ధుడు సన్యాసినులను తన వెంట ఉంచుకోవటానికి ఒప్పుకోవటంలేదని ప్రజాపతి ఆమెతో అన్నది.




కాలక్రమాన యశోధర అనేకమంది ఆస్తికి వారసురాలయింది. వారిలో శుద్ధోదనుడూ, మహామాయా, మహాప్రజాపతీ, సిద్ధార్థుడూ, నందుడూ, రాహులుడూ, దేవదత్తుడూ, సుప్రబుద్ధుడూ ఉన్నారు. కాని ఈ ప్రాపంచిక సంపదలపైన ఆమెకు మనస్సు విరిగిపోయింది. ఆమె మరి వెయ్యిమంది క్షత్రియ స్త్రీలను వెంటపెట్టుకుని మహాప్రజాపతివద్దకు వెళ్లింది. ఆమెను వెళ్లకుండా చెయ్యటానికి కపిలవస్తు, కోలీ నగరాల ప్రజలు ప్రయత్నించారు, కాని ఆపలేకపోయారు. వారిచ్చిన రథాలుకూడా నిరాకరించి ఆమె కాలినడకనే వెళ్లింది.

అప్పటికి ప్రజాపతి నాయకత్వంకింద బౌద్ధ సన్యాసినులు ఒక కూడలిగా ఏర్పడ్డారు. యశోధర వారితోపాటు చేరింది.

యశోధరకు డెబ్బయి ఎనిమిదో ఏడు జరుగుతున్నది. ఒకనాటి సాయంకాలం ఆమెకు నిర్వాణం పొందాలన్న భావం కలిగింది. ఆమె బుద్ధుడి వద్దకు వెళ్ళి నిర్వాణం పొందటానికి అనుమతి వేడింది. బుద్ధుడు అనుమతించాడు. ఆ రాత్రే ఆమె తన కుటీరంలో నిర్వాణాన్ని పొందింది.

మరి రెండేళ్లు గడిచాయి. బుద్ధుడికి ఎనభయ్యో ఏడు నడుస్తున్నది. ఆయన తన





శిష్యులనందరినీ వెంటబెట్టుకుని పావానగరానికి వెళ్ళి అక్కడ చుందుడనే ఒక కమ్మరియొక్క మామిడితోపులో విడిశాడు. ఈ సంగతి విని చుందుడు పరమానంద భరితుడై వారందరినీ తన ఇంటికి ఆహ్వానించి పందిమాంసంతో విందుచేసి పెట్టాడు.

బుద్ధుడు బుద్ధత్వం పొందేటప్పుడు సుజాత ఆయనకు ఆహారం పెట్టింది. నలభై అయిదు సంవత్సరాల అనంతరం చుందుడు ఆయనకు ఆఖరుభోజనం పెట్టాడు. ఈ ఆహారం బుద్ధుడికి వ్యాధి కలిగించింది. ఆయనకు అతిసారమూ, దాహమూ, నిస్త్రాణా పట్టుకున్నాయి. ఆయన పావానుంచి కుశీనగరానికి బయలుదేరి, ఆ పన్నెండుమైళ్ళ దూరంలోనూ ఇరవై అయిదుసార్లు విశ్రమించాడు.

ఆయన తన నిర్వాణం సమీపించిందని తెలుసుకుని తన అనుచరులతో ఆ సంగతి చెప్పాడు. బుద్ధుణ్ణి హిరణ్యవతీ నగరం అవతలి ఒడ్డున ఉన్న ఉపవర్తనమనే సాల వనంలోకి చేర్చారు. రెండు సాలవృక్షాల మధ్య ఆయన ఉత్తర దిక్కుగా తల పెట్టి పడుకున్నాడు.

బుద్ధుడు నిర్వాణం చెందబోతున్నాడని ఆనందుడు కబురుచేయగా మాళ్వరాజులందరూ ఆయన దర్శనం చేసుకోవటానికి తమ భార్యలతోసహా వచ్చారు. బుద్ధుడు ఆఖరుక్షణంలో తన శిష్యులతో, "నేను చేసిన ధర్మబోధలను గురించి మీకేమైనా అనుమానాలుంటే ఇప్పుడే అడగండి!" అన్నాడు. కాని ఎవరికీ అనుమానాలు లేవు, వారేమీ అడగలేదు.

తరవాత బుద్ధుడు కన్నుమూశాడు. బుద్ధుడి అవతారం ముగిసింది. కాని ఆయన చాటిన ధర్మాలు దశదిశలా వ్యాపించి, ఖండాంతరాలకు కూడా పాకి వివిధ దేశాల ప్రజలు ధర్మమార్గాన జీవించటానికి సహాయపడ్డాయి. —(అయిపోయింది)



ప్రఖ్యాత యాత్రికుడు మార్కో పోలో

ఈనాడు అన్ని దేశాలూ ఏక ప్రపంచంగా ఉన్నాయి. రైళ్ళు, విమానాలూ, రేడియో, టెలిగ్రాఫు వగైరా సౌకర్యాల మూలంగా అన్ని దేశాల మధ్యా సన్నిహితత్వం ఉంటున్నది. కాని కొన్ని శతాబ్దులక్రితం ఒక్కొక్క దేశం ఒక్కొక్క ప్రపంచంగా ఉండేది. పశ్చిమ దేశాలవారికి ప్రాచ్యదేశాలు తెలియవు; ఎప్పుడైనా ఇండియా చైనాలను గురించి వారు విన్నప్పటికీ అంతా కట్టుకథలలాగే ఉండేవి. అటువంటి స్థితిలో కొంతమంది ధైర్యవంతులు ప్రపంచాటన చేసి దూరదేశాలను గురించి వాస్తవ వార్తలు తెచ్చారు.



ఇలా ప్రపంచాటన చేసినవారిలో చరిత్ర ప్రసిద్ధ పురుషుడు మార్కోపోలో అనే వెనిస్ నగరవాసి. అతను 1254 లో జన్మించాడు. అతను తన పదిహేడవ ఏట తన తండ్రి పినతండ్రుల వెంట కాలినడకను వెనిస్ నుంచి బయలుదేరి అంతులేని దూరాలు పర్యటించాడు. పోలోలు ముగ్గురూ కొండల మీదుగా, మండుటెడారుల మీదుగా, అతిశీతలప్రాంతాల మీదుగా ఎంతో ప్రయాసతో ప్రయాణించి చివరకు చీనాదేశం చేరారు.

ఆ కాలంలో అక్కడ పరిపాలిస్తూ ఉండిన మంగోలియన్ చక్రవర్తి కుబ్లాయ్ ఖాన్ (1216-1294) వారు ముగ్గురికీ ఆతిథ్యమిచ్చాడు. మార్కో ఆయన ఆస్థానంలోనే పెరిగి పెద్దవాడై కుబ్లాయ్‌ఖాన్ దూతగా కొచిన్ చైనా, ఇండియా, తదితర దేశాలకు వెళ్ళాడు. అతను అనేక భాషలు నేర్చినవాడు; తాను వెళ్లిన పని పూర్తిచేసుకు రావటమేగాక ఆయా దేశాలలోని జీవితం గురించీ, నదీ పర్వతాలను గురించీ, ఆచార వ్యవహారాలను గురించీ రాజుకు తెలిపాడు.

పోలోలకు స్వదేశాన్ని వదిలిన ఇరవైమూడేళ్లకు వెనిస్‌మీద బుద్ధి మళ్లింది. వారు వెళ్లిపోవటం ఎంతమాత్రమూ ఇష్టం లేకపోయినా కుబ్లాయ్ ఖాన్ చివరకు అనుమతించాడు. వెనిస్‌కు తిరిగి వచ్చాక మార్కోపోలో తాను చూసినదంతా ఒక గ్రంథంగా రచించాడు. ఆ గ్రంథంలోని విషయాలను చాలా కాలం ప్రజలు నమ్మలేదు. కాని ఆ పుస్తకమే కాలక్రమాన ఇతర ప్రపంచాన్వేషకులకు ప్రోత్సాహం ఇచ్చింది. అతని పుస్తకం చదివి ప్రపంచం చూడటానికి బయలుదేరిన ప్రసిద్ధులలో కొలంబస్ ఒకడు. ఆయన సముద్రమార్గాన ఇండియాకు వచ్చే ప్రయత్నంలో అమెరికా ఖండాన్ని కనిపెట్టాడు. రానురాను మార్కోపోలోకు ప్రపంచాన్వేషకుడుగా అసమానమైన ఖ్యాతి వచ్చింది. అతని "సాహస యాత్రలు" పై సంచికనుంచీ "చందమామ"లో చదవండి. అందులో ఆనాటి ప్రపంచ పరిస్థితులు ఎన్నో తెలుస్తాయి.



4 సాహస చర్యలు

శౌరా, ఆమె భర్తా షాంటలీవద్ద ఒక పెద్ద ఎస్టేటు కొన్నారు. అది చాలా ప్రశాంతమైన స్థలం, అందులో పెద్దపెద్ద ఇళ్ళున్నాయి. జంతువులను మచ్చిక చెయ్యటాని కది ఆదర్శప్రాయమైన చోటు. అక్కడి స్వచ్ఛమైన గాలీ, వెలుతురూ వన్యమృగాలకు ఆరోగ్యవంతమైనవి. అయినప్పటికీ వాటికి అప్పుడప్పుడూ ఏదైనా జబ్బు చేస్తూనే ఉండేది. శాంద్రా అనే ఆడసింహానికి అనేక పర్యాయాలు గొంతులో వ్రణం లేచింది. ఒకసారి అది బాధపడుతూ ముడుచుకుపడుకుని తిండికూడా నిరాకరించింది. అది బతుకుతుందా అనికూడా అనిపించింది. శారాకు తన జంతువులమీద ఎంతో ప్రేమ, ఆమె దిగులుపడింది. నేనా సమయానికి అక్కడ అతిథిగా ఉన్నాను. శాంద్రాను చూసేసరికి దాని దవడకింద వాపు ఉండటం నాకు కనబడింది. దాన్ని మరింత బాగా పరీక్షింతామనే ఉద్దేశంతో శారా దాన్ని శిక్షణ ఇచ్చే బోనులోకి తరిమింది. శాంద్రా పొట్ట నేలకానించి పడుకుని బతిమాలినా, భయపెట్టినాకూడా కదలలేదు. చలికాలం కావటంవల్ల దానికి మరింత జబ్బు చేస్తుందేమోనని భయపడి శారా దానిని తిప్పి దాని స్థలానికి పంపే ఉద్దేశంతో, రోజూ వెళ్ళినట్టే, ఆ బోనులోకి వెళ్ళింది.

శాంద్రా చాలా బాధపడుతున్నది. తన యజమానురాలిని చూసేసరికి బహుశా దానికి ఇంతకుముందు ఇలాటి బాధకే చికిత్స జరిగిన సంగతి జ్ఞాపకంవచ్చి ఉంటుంది. శారావచ్చి తన వ్రణాన్ని ముట్టుకుంటుందనే అది భయపడిందో, లేక బాధ భరించలేక వెర్రెత్తిపోయిందో తెలియదు;

జిమ్ ఫ్రే

ముందుగా అఘాయిత్యం చెయ్యబోయే లక్షణం ఒక్కటికూడా లేకుండానే అది తన బద్ధకాన్ని యావత్తూ వదిలించుకుని శారాపైకి లంఘించింది. ఎలాగైనా అనుభవం గలది గనక శారా కంగారుపడక ఫోర్కుతోనూ, కొరడాతోనూ ఎంతో ధైర్యంగా ఆ ఆవేశంతో ఉన్న సింహాన్ని ఎదుర్కొన్నది. అయితే శాండ్రా కొంచెంకూడా లక్ష్యపెట్టలేదు, దానికి సగం మతిపోయి ఉన్నది. అది వెనక్కు తగ్గటానికి మారుగా, భయంకరంగా గర్జిస్తూ, దవడలవెంట చొంగ కార్చుతూ శారాపైకి మరింత క్రూరంగా వెళ్ళింది. అది తన గోళ్ళను విప్పింది, తగిలే దెబ్బలను ఏమాత్రమూ ఖాతరు చెయ్యలేదు. శారా ప్రమాదస్థితిలో ఉన్నట్టు కనబడింది. ఆమె ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ అలవమూలకు చేరుకున్నది. ఇంక వెనక్కు పోవాలన్నా లేదు.

అది విపత్కరస్థితి. శాండ్రా అలాగే మరి కాస్సేపు విజృంభించిందంటే ఫలితం ఏమయేదీ తెలుస్తూనే ఉన్నది. ఈలోపుగానే నేను కూడా ఆ అలవలోకి ప్రవేశించి శాండ్రాను వెనకనుంచి సమీపించాను. సింహం పంజావిసురు శారా తొడలకూ, పొట్టకూ అతి సమీపంలో ఉన్నాయి.



ఆ తరుణంలో శాండ్రా దృష్టి మరల్చటానికి నాకు సాధ్యమైనంత చప్పుడు చేశాను. దాని తొంటిపైన సత్తువకొద్దీ కొట్టాను.

నా ప్రయత్నం ఫలించింది. శాండ్రా వెనక్కు తిరిగి ఒక్క దూకులో నాపైన వచ్చి పడింది. దాని గోళ్లు నా ఎడమచేతిలో దిగబడ్డాయి. నేను వెనక్కు తగ్గేటప్పుడు నా చేతివెంబడి రక్తం కారుతూండటం తెలియవచ్చింది. మొదట్లో నా చెయ్యి పోయిందే అనుకున్నాను. ఇదంతా వర్ణించటాని కింతసేపు పట్టింది గాని జరగటానికి కొద్ది క్షణాలే పట్టింది. నా చేతిలో ఒక్క కొరడా మాత్రమే ఉన్నది, ఇంకొక ఆయుధం



తీసుకునే వ్యవధికూడా లేకపోయింది. అయితే నేను దెబ్బ తినని చేత్తో, ఆత్మరక్షణోద్రేకంలో, సింహం ముక్కుమీద బలమైన దెబ్బల వర్షం కురిపించాను. ఆ క్రూరమైన దెబ్బలతో దాని ఉద్రేకం చల్లారింది. గట్టిగా రొప్పుతూ, డొక్కలు ఎగరేస్తూ అది అవతలికి జారుకున్నది.

శారా త్వరగా నా వెనక్కు వచ్చి బోను తలుపు తెరిచింది. మేమిద్దరమూ చప్పున బయటపడి తలుపు మూశాం. మాది ఘనంగా చెప్పుకోదగిన తిరోగమనం కాదు, అయితే తరవాత పరిశీలించగా నేను తిన్న దెబ్బ అనుకున్నంత ప్రమాదమైనది కాదని తేలింది. తేలికలో బయటపడ్డందుకు సంతోషించాను. మా ఇద్దరికీ ఇది చెడ్డ అనుభవమే, కాని దీనివల్ల ఒక్క మంచి జరిగింది—శాంద్రావ్రణం కాస్తా పగిలింది. నన్ను పీకిందని నేను దానిమీద అలగలేదు. బాధలో లేనప్పుడది చాలా మంచి జంతువు—అయితే ఏంగాక, అది ఆడసింహం!

* * *

జంతువులను మచ్చిక చేసేవారిలో నా ఎరుకలో రొలాండ్ ఫ్రాం ను మించిన దుస్సాహసి బహుశా ఉండడు. అతను సర్కస్ ప్రపంచంలో రొలాండా అనే పేరుతో వ్యవహరిస్తాడు. నాలుగేళ్ళకే అతను పనిలో ప్రవేశించాడు, తొమ్మిదోఏట పరిగెత్తే గుర్రాల మీద ఫీట్లు చేశాడు, పధ్నాలుగేళ్లకు సింహాలతో పనిచేశాడు.

రొలాండ్ ద్వారా నేను టార్గాను పరిచయం చేసుకున్నాను; టార్గా నేను చూసిన అందమైన జంతువులలో ఒకటి. మొదట్లో టార్గాతోబాటు మరి మూడు ఆడసింహాలు కలిసి పనిచేసేవి. ఒక చలికాలం బోనులు శుభ్రం చేసేవాడు బోనులు శుభ్రం చేసి ఎండుగడ్డి వెయ్యటం మరిచాడు. ఆట అయాక అవి తడిగడ్డిలో పడుకోవటంవల్ల మర్నాటి ఉదయానికి వాటిలో మూడు చచ్చి



పోయాయి. టార్గా ఒకటే ప్రాణాలతో ఉన్నది. అది కోలుకోవటానికి పూర్తిగా వారం పట్టింది. అంతకాలమూ రొలాండ్ దానివెంటనే ఉండి, దానికివ్వవలిసిన ఇంజెక్షన్లు తానే ఇచ్చాడు. చిట్టచివరకు టార్గా కళ్ళు తెరిచి, తన ప్రాణాన్ని కాపాడిన వాడికేసి చూసింది.

అది మామూలు సింహం కావటానికి చాలాకాలం పట్టింది, అంతకాలమూ అది చాలా కోపిష్టిగానూ, ప్రమాదకరంగానూ ఉంటూవచ్చింది. చివరకు రొలాండ్ పరిచర్యలతో అది ఆరోగ్యం పొందింది, దానితో బాటు దాని సాధు స్వభావంకూడా తిరిగి వచ్చింది—అంత మంచి స్వభావం గల ఆడ సింహాన్ని నేనెక్కడా చూడలేదు.

పనిలోకూడా అది అనుపమానమైనది. ఎప్పుడన్నా రొలాండ్ చేతినుంచి కొరడా పడిపోతే అది తన పంజాతో పట్టి తీసుకు వచ్చి అతనికి ఇచ్చేది—అడగకుండానే! ఇది దానికెవరూ నేర్పిన విద్యకూడా కాదు. ఆటమధ్య దానివెంట ఉండే సింహాలలో ఏదైనా కొంచెం పంజా ఎత్తినట్టయితే తన యజమానికి ఎక్కడ ప్రమాదం జరిగి పోతుందో అన్నట్టుగా, అది అవతలి సింహం మీద దూకి వెల్లకిలా తోసేసేది.



ఒకసారి అల్జియర్స్‌లో రొలాండ్ తన ప్రదర్శనం ముగించి సింహాలను బోనుల్లోకి పంపేశాడు. అన్నింటికన్నా టార్గా అఖరుకు వెళ్ళేది. దానికి ఉత్సాహం పుట్టి అది గెంతుతూ తన యజమానికేసి వచ్చింది. అది కుక్కలాగా యజమానికేసి రాచుకోవటానికి బదులు, అనుకోకుండా అతని కాళ్ల సందుకు వచ్చేసింది. రొలాండ్ ఒక్క ఎగురు ఎగిరి కిందపడ్డాడు. ఎలాగైనా సింహం సరసం కాస్త మోటే. మరొకసారి "పిరమిడ్" నుంచి దిగివస్తూ అది తొందరలో పీటను తన్నేసేసరికి అది కాస్తా రొలాండ్ నెత్తిన పడింది.

మరుసటి వారం అతను దాన్ని భుజాల మీదికి ఎత్తుకున్నాడు—రోజూ చేసే పనే. అయితే, సున్నితమైన దాని పొట్టమీది చర్మం ఎక్కడ నొచ్చిందోగాని, అది ఒక్కసారి స్ప్రింగులాగా ముడుచుకుపోయింది; ఆ ముడుచుకోవటంలో దాని తొడ ఎముక అతని దవడకు బలంగా తగిలి అతను కింద పడిపోయినంత పని జరిగింది.

ఒకసారి సర్కసు ఎత్తేసి మరొకచోటికి బయలుదేరి పోతూండగా "సింహాలు తప్పించుకున్నాయి!" అన్న కేక విన పడింది. ఆ సమయానికి ఆ ప్రాంతాల మేత మెయ్యటానికి ఒక పశువులమంద వచ్చింది. సింహాలు కనపడి, వాటి వాసన కొట్టేసరికి అవి బెదిరి రంకెలు వేస్తూ చెల్లాచెదురుగా పారిపోయాయి. బళ్ళలోనుంచి రొలాండ్ దిగి, తన తండ్రి మొదలైనవారి సహాయంతో ప్రమాదాన్ని ఎదుర్కొంటూ, ఎలాగైతేనేం నాలుగు సింహాలను బోనుల్లోకి చేర్చాడు.

కాని టార్గా ఆటలో పడి, స్వాధీనంకాలేదు. రొలాండ్ దాని మెడకు ఉచ్చు వేద్దామని ప్రయత్నిస్తే తప్పించుకుని ఒక లారీపైకి ఎక్కింది. బతిమాలినా, కొరడా ఛెళ్ళుమని పించినా, బెదిరించినాకూడా అది దిగి రాలేదు. చివరకు రొలాండ్ ఒక పెద్ద డబ్బా తెచ్చి మూత తెరిచి ఉంచాడు; అందులో అప్పుడప్పుడూ టార్గా ప్రయాణించేది. అతను ఆశించినట్టు టార్గా అందులోకి దూకింది. కాని అందులో అదివరకే ఒక నల్ల ఎలుగు బంటి ఉండిన సంగతి అదావుడిలో రొలాండ్ గమనించలేదు. టార్గా లోపలికి వస్తుండగానే ఎలుగుబంటి దాని ముఖంమీద బలంగా కొట్టింది. టార్గా దానితో కలియ బడింది. కాని ఆ కొద్ది ఆవరణలో ఎలుగు బంటిదే పైచెయ్యి అయింది. గత్యంతరం లేక డబ్బామూత తెరిచారు. పాపం, టార్గా బాగా దెబ్బలు తిని, ఎలుగుబంటి చేతిలో ఓడిపోయి బయటపడింది.





గంగావతరణము

తృతీయాశ్వాసము

రాకొమరులు ఏమయిరో
రాకుండిరి ఎన్నాళ్లకు;
యజ్ఞాశ్వము ఏమయినదొ
ఆచూకీ లేకున్నది.

సగరరాజు సభ దీరిచి
దిగులుతోడ కూర్చుండెను;
జనులతోడ నిండి సభయు
సడిచప్పుడు లేకుండెను.

ఇంతలోన భటు డొక్కడు
ఏగుదెంచి పలికినాడు:
జయము జయము! మహరాజ!
సగరరాజ! రవితేజా!

వంగదేశమునకు తూర్పు
వైపునగల సంద్రములో
పాతాళపు గుహ కలదట!
ప్రభుసుతు లట జొరబడిరట.

ఎన్నాళ్లకు రాకొమరులు
ఇవతలకును రాలేదట;
చేపలరా జొకరు మాకు
చెప్పె నిద్ది మహప్రభూ!

అని పలికియు భటుడు వంగి
వినయముతో వెనుక కేగె;
సగరరాజు సభ నంతట
చాలించియు లోని కేగె.

అంశుమంతు బిలిపించెను,
అతడు వచ్చి మ్రొక్కి నిలచె;
దీవించెను సగరరాజు
దీనముగా తన మనుమని.

సగరరాజు కనులనుండి
జాఱెను కన్నీటి బొట్లు;
ప్రియ మారగ తన మనుమని
పిలిచినాడు కౌగిలికిని.

ఉత్పల సత్యనారాయణాచార్య



తాతా! యని మనుమ డేగి
చేతులతో చుట్టి వైచె;
అంశుమంతు దన గుండెకు
అద్దుకొనెను రా జప్పుడు.

"యజ్ఞాశ్వము వెదకుండని
అజ్ఞ యిచ్చి, కఠినమ్ముగ
నీ తండ్రుల బాధించిన
పాతకుడను, నీ తాతను.

పాతాళపు గుహలోనికి
నీ తండ్రులు చొరబడిరట;
ఎంతకాలమునకు వారు
ఇవతలకును రాలేదట.

ఏమయిరో? నీ తండ్రులు
ఎందున్నదో? యజ్ఞాశ్వము
చెడిపోయెను యజ్ఞమ్మును
కొడుకుల బోగొట్టుకొంటి!

అంశుమంత! నీ వొకడవె
వంశమునకు మిగిలినావు
కులగౌరవ మర్యాదలు
నిలబెట్టుట నీ భారము."

అని పలికెడు సగరరాజు
కనులు రెండు చెమ్మగిల్లె
అంశుమంతు డతని కాళ్ళు
అద్దుకొనుచు పలికె నిట్లు:

"నను పంపుము, తాతయ్యా!
పినతండ్రుల వెదకి తెత్తు;
ఎటనున్నను యజ్ఞాశ్వము
ఇపుడు తెచ్చి నీ కిత్తును.

ఇంత చిన్న పనికి నీవు
చింతించెద వేల, తాత!
అన తిచ్చి నను పంపుము
ఆశీస్సుల గురియింపుము."

అని పలికిన సగరరాజు
తన మనుమని లేవనెత్తి
ఆశీస్సుల గురియించెను,
అశ్రువులను వర్షించెను.

అపు డపుడే గుఱ్ఱ మెక్కి
అంశుమంతు డదలించెను,
ఆ గుఱ్ఱము గాలి కంటె
వేగమ్ముగ పరుగెత్తెను!


తను లేపిన పెనుధూళికి
తాకరాని వడి గలదై,
ఆ గుఱ్ఱము గాలి కంటె
వేగమ్ముగ పరుగెత్తెను!

చెవి దాకను లాగి విడుచు
చెంచువాని విల్ల మ్మయి,
ఆ గుఱ్ఱము గాలి కంటె
వేగమ్ముగ బరుగెత్తెను!

ఆ గుఱ్ఱము పోయి పోయి,
ఆగె తూర్పు సంద్రము కడ—
అంశుమంతు డశ్వము దిగి,
ఆ సంద్రములోని కేగె.

సంద్రములో ఈది ఈది,
చాల దూర మేగి యేగి,
సుడిగుండమునందు మునిగి,
చొచ్చినాడు పాతాళము.

పాతాళపు ద్వారము కడ
బండరాయి పడి యున్నది;
ఆ రాతికి ప్రక్కన గుహ
నోరు తెఱచుకొని యున్నది!



అందులోన పెను చీకటి,
అగుపించదు ఏ ఒక్కటి;
అంశుమంతు డదరిపడుచు
అరుగసాగె లోలోనికి.

అంత నెవరొ పిలిచినారు,
అంశుమంత! రమ్మా యని;
గుహ యంతయు నొక్క సారి
గొల్లు మంచు ధ్వనియించెను!

అంశుమంతు డులికి పడెను,
ఆ చీకటి మాయ మయ్యె;
బూదికుప్ప లె న్నెన్నియొ
పొవు కొలది ఎదు రయ్యెను.

ఎదురుగ నొక గుఱ్ఱము కడ
ముదుసలి యగు ఋషి యుండెను;
"అంశుమంత! రా ర"మ్మని
అత డాదరమున పిచిచెను.

"కపిలఋషిని! ఓ కుమార,
కడకు రమ్ము దీవింతును.
యజ్ఞాశ్వము మీదే యిది
అప్పగించుచున్నాడను.

సగరరాజు యజ్ఞ మ్మిక
సంపూర్ణము చెందుగాత!
సూర్యవంశ రాజులకును
శుభములు సమకూరుగాత!"

ఆ మాటల కంశుమంతు
డానందము పొందినాడు;
మునివరునకు చుట్టు తిరిగి
మ్రొక్కి ఇట్లు పలికినాడు:

"ఓ మహాత్మ కపిలర్షి!
హే మహాత్మ పరమర్షి!
మీ పదముల చేరువగా
నా ప్రార్థన మొక టున్నది.

స్వామీ! మా పినతండ్రులు
ఏమయిరో ఎఱుక పడదు.
ఈ బూడిద రాసి చూడ
ఏమో భయ మగుచున్నది."

అని యిట్టులు పలికి యతడు
కనులనీరు గార్చుచుండ,
కపిలు డతని నోదార్చుచు
కనికరమున పలికె నిట్లు:

"ఓయీ! నీ పినతండ్రులు
చేయరాని పని చేసిరి.
వారి గర్వమునకు వారె
ఈ రీతిగ బూది యయిరి.

దుష్టులకును ఎల్లప్పుడు
దుర్గతులే అగుచుండును.
ఈ గుఱ్ఱము గొనిపొ మ్మిక
యాగమ్మును సాగింపుము." (స శే.)



4. మహాబలిపురం

మహాబలిపురం తూర్పుసముద్ర తీరాన మద్రాసు నగరానికి 35 మైళ్ళ దూరంలో ఉన్నది. 7 వ శతాబ్దంలో పల్లవ చక్రవర్తులు ఇక్కడ ఒక నగరాన్ని నిర్మించారు. ఈ నగరాన్ని మామల్లపురం అనికూడా అంటారు.

గతించిన 13 శతాబ్దుల కాలంలో నగరం శిథిలమైపోయింది; కాని అపూర్వమైన పల్లవ శిల్పాలు ఇప్పటికీ కొంతవరకు నిలిచిఉన్నాయి. దక్షిణదేశంలో శిల్పకళను మొట్టమొదటగా ఆదరించి పోషించినవారు పల్లవులే. వీరు తయారు చేయించిన శిల్పాలు కంచి (కాంచీపురం) లోనూ మహాబలిపురంలోనూ ఉన్నాయి. ఈ శిల్పాలు చూడటానికి విదేశీయులు ఇక్కడికి తరుచుగా వస్తూంటారు.

మహాబలిపురంలోని శిల్పాలు పెద్దపెద్ద రాళ్లను మలిచి తయారుచేసినవీ, కొండరాతిలో చెక్కినవీనూ. వీటిలో ముఖ్యమైనవి అయిదు రథాలు. వీటిని పాండవుల రథాలంటారు.

మహిషాసుర మండపం గుహలో నిర్మించిన గుడి. ఇందులో అద్భుతమైన చెక్కడాలు—శేషశాయి అయిన విష్ణువూ, మహిషాసుర మర్దనీ—ఉన్నాయి.



కృష్ణమండపంలో కృష్ణుడి చరిత్రకు సంబంధించిన చెక్కడాలున్నాయి. అర్జునుడి తపస్సు మరొక మంచి చెక్కడం.

సముద్రతీరాన ఉన్న ఆలయం రాజసింహుడు కట్టినదని చెబుతారు. ఇక్కడ ఏడు ఆలయాలుండేవనీ, ఇది తప్ప మిగిలిన వన్నీ సముద్రంలో మునిగిపోయాయనీ ప్రతీతి.





1. *పి. ఈశ్వర్, సికింద్రాబాద్*

"గంగావతరణము" చదివి చాలా సంతోషించితిమి. గ్రంథకర్తను కలుసుకోవలెనని మా కుతూహలము. ఎడ్రసు తెలుపవలెను.

"గంగావతరణం" ప్రశంసిస్తూ చాలామంది పాఠకులు లేఖలు రాశారు. కవిగారి ఎడ్రసు: శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య, తెలుగు పండితులు, గవర్నమెంటు హైస్కూలు, సికింద్రాబాదు. మీఊరే గనక స్వయంగా కలుసుకోవచ్చు.

2. *మండా శివరామమూర్తి, శ్రీకాకుళం*

"బాపు" గారి బొమ్మలు చూచి చాలా సంతోషంగా యున్నది. త్వరలో "బాపు" గారి బొమ్మలతో సీరియల్ (రంగులలో) యేదేనా ప్రచురిస్తే ఇంకా సంతోషిస్తాం.

అలా అయితే వచ్చే సంచికనుంచే "గలివర్ యాత్రలు" "బాపు" గారి రంగుల బొమ్మల సీరియల్ ప్రారంభించుతున్నాం.

3. *టి. సరోజ, హైద్రాబాదు*

"గంగావతరణము" చాలా బాగున్నది. తొందరగా పుస్తకం వేస్తే చదివి ఎప్పటికి పాడుకొంటాము.

పుస్తకం కాలక్రమాన ఎలాగూ వస్తుంది. ఈలోపుగా చందమామ కాపీలు జాగ్రత్తచేసి పెట్టుకుని స్వరాలు జతపరిచి ఉంచండి.

4. *టి. జయరామచెట్టి, కుమారబొమ్మరాజపురం*

మూడు మాసముల పైగా మీకు నా సందేహాలను పంపియుంటిని. మీరు సమాధాన మీయలేదు.

ఈ ఆరోపణ చాలామంది పాఠకులు చేయవచ్చు. కొద్దిమంది చేస్తున్నారుకూడా. "చందమామ" పాఠకులకు ఆసక్తి కలిగించే ప్రశ్నలకు సాధ్యమైనంతవరకు, ఉన్న పరిమితిలో సమాధానాలిస్తూనే ఉన్నాం.

5. ఎం. వి. సుబ్బారావు, జాండ్రపేట

పాఠకులు పంపిన అన్ని ప్రశ్నలకు సమాధానా లిస్తారా?

అన్నిటికీ సమాధానా లిస్తే "చందమామ" పేజీలన్నీ ప్రశ్నోత్తరాల శీర్షికకే చాలవు.

6. వడ్లమాని హనుమాయమ్మ, అమలాపురం

దాసూ, వాసూలను ఈ ఉగాది పండగకు మా యింటికి తెచ్చుకోదలిచాం. ఎప్పుడు పంపుతారు?

నెలనెలా పంపిస్తూనే ఉన్నామే!

7. జి. వి. రాధాకృష్ణ, నరసపట్నం

ప్రశ్నలకు జవాబులు రెండు పేజీలే ఇస్తున్నారు. హెచ్చు కాగితాలను ఉపయోగించ కూడదా?

ప్రశ్నోత్తరాల శీర్షిక ఇంకా పెంచాలంటే కథలో, ఇతర శీర్షికలో తగ్గించాలి. ఏది తగ్గించమంటారు?

8. మునగవలస రంగారావు పట్నాయక్, వేణమ్మపేట

సింద్‌బాద్ కథలు "చందమామ" పుస్తకరూపాన ప్రచురించిందా?

ఇంకా లేదు.

9. వి. ఎస్. శేషాద్రి, రాజంపేట

బాలనాగమ్మ, రత్నకిరీటం, శబ్దవేధి మొదలగునవి పుస్తకరూపంలో అవతరించాయా?

ఇంకా లేదు.

10. వై. భాస్కర సుబ్రహ్మణ్యం, హైదరాబాదు

ప్రతి నెలా మీరు ప్రచురించే ఫొటోవ్యాఖ్యల పోటీకి సరియైన వ్యాఖ్యలు మీకు ముందే తెలుస్తాయా? లేక పాఠకులు పంపే వ్యాఖ్యలమీద ఆధారపడతారా?

పాఠకులు పంపే వ్యాఖ్యలలో ఉత్తమమని తోచినవాటికి బహుమానం ఇస్తున్నాం.

11. ఎస్. పార్థసారథి, మైసూరు

మీరు ప్రకటించే "అహింసాజ్యోతి" పూర్వం ప్రకటించిన జాతక కథల పునరావర్తనం కాదా?

"జాతక కథలు" బుద్ధుడి పూర్వజన్మలకు సంబంధించినవి, "అహింసాజ్యోతి" గౌతమబుద్ధుడి జీవితకథ.


బానిస తెలివి

ఒక రాజుగారి దగ్గిర కొందరు బానిసలుండేవారు. ఒకనాడు వారిలో ఒకడు రాజభవనం వదిలి అడవుల్లోకి పారిపోయాడు. రాజుగారి సైనికులు అడవి అంతా గాలించి వాణ్ణి పట్టుకుని రాజుగారి దగ్గిరకు తీసుకువచ్చారు. మంత్రి ఆ బానిసకు మరణశిక్ష విధించటమే వుత్తమమని సలహా యిచ్చాడు. అది వింటూనే బానిస చేతులు జోడించి రాజుగారికి నమస్కరిస్తూ, "మహారాజా, నేను స్వేచ్ఛ కోరి అడవుల్లోకి పారిపోయాను. అంతేగాని నేను ఎవరికి హానిచేసింది లేదు. నిర్దోషినైన నన్ను చంపించినందుకు తమకు నరకం తప్పదు," అన్నాడు.

"అలాగా! అయితే నరకం తప్పేందుకు నన్నేమి చెయ్యమంటావు?" అన్నాడు రాజు చిరునవ్వు నవ్వుతూ.

"నాకు మంత్రిని చంపేందుకు అనుమతి యివ్వండి. అప్పుడు నేను హంతకుణ్ణవుతానుగదా? ఆ తరవాత నన్ను వురి తీయించినందువల్ల మీకు ఏ పాపమూ అంటదు," అన్నాడు బానిస.

బానిస తెలివితేటలకు సంతోషించి రాజు అతడికి స్వేచ్ఛ యిచ్చాడు.



ఫోటోవ్యాఖ్యల పోటీ :: బహుమానం రు. 10 లు

1960 మే సంచికలో ప్రకటింపబడే ఫోటోలకు నమూనాలు





★ పై ఫోటోలకు సరిఐన వ్యాఖ్యలు ఒక్క మాటలోగానీ, చిన్న వాక్యంలోగానీ కావాలి. (రెండు వ్యాఖ్యలకూ సంబంధం వుండాలి.)

★ మార్చి నెల 10-వ తేదీలోగా వ్యాఖ్యలు మాకు చేరాలి. తరువాత చేరే వ్యాఖ్యలు ఎంత మాత్రమూ పరిశీలింపబడవు.

★ మాకు చేరిన వ్యాఖ్యలలో అత్యుత్తమంగా వున్న సెట్టుకు (రెండు వ్యాఖ్యలకు కలిపి) రు. 10/లు బహుమానం.

★ వ్యాఖ్యలు రెండూ పోస్టుకార్డుపైన వ్రాసి, ఈ అడ్రసుకు పంపాలి:- చందమామ ఫోటో వ్యాఖ్యల పోటీ, మద్రాసు-26.

మార్చి నెల పోటీ ఫలితాలు

మొదటి ఫోటో : 'పదరా అన్నా వేటకు'

రెండవ ఫోటో : 'రావే చెల్లీ ఆటకు'

పంపినవారు : ఎస్. వి. ఎ. రమణమూర్తి,
పాండురంగ వీధి, డోర్ నం. 6/28, శ్రీకాకుళం.


బహుమతిమొత్తం రు. 10/- ఈ నెలాఖరులోగా పంపబడుతుంది.

చిత్రకథ






ఒకరోజున దాసూ, వాసూలు తోటలో బంతి ఆట ఆడుకుంటున్నారు. ఒకళ్ళు విసిరిన బంతిని మరొకరు పట్టుకోలేనప్పుడు, 'టైగర్' పరిగెత్తి దాన్ని పట్టుకుని, వాళ్ళకు తెచ్చి యిస్తున్నది. ఆ సమయంలో ఒక కొంటె కుర్రాడు, ఒక పెద్ద కుక్కను వెంట పెట్టుకుని అక్కడికి వచ్చాడు. వాడికి బంతి కాజేయాలని బుద్ధి పుట్టింది. తనవెంట వున్న కుక్కను మెల్లిగా ఉసికొల్పాడు. అది, వాసు వైపుకు దాసు బలంగా విసిరిన బంతిని, మధ్యలోనే పట్టుకోవాలని ఎగిరింది. దానితో, బంతి గట్టిగా నోట్లో తగిలేసరికి, అది వెల్లికిలా పడి లేచి, కుయ్యోఁమంటూ తిరిగి చూడకుండా వుడాయించింది. కొంటెకుర్రాడుకూడా దాని వెంట పారిపోయాడు.





Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3 Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'

Photo by P. Krishna Kumar




బహుమతి
పొందిన వ్యాఖ్య

'రావే చెల్లీ ఆటకు'

పంపినవారు:
S. V. A. R. మూర్తి - శ్రీకాకుళం

75



అహింసాజ్యోతి